www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -243 శనివారం 6 డిసెంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా వినికిడి తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545



# రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నాం

## నర్సంపేటలో రూ.532 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధిని గాలికి వదిలేశారు
- ఫ్రామ్‌హౌజ్‌లు కట్టుకుని వేలకోట్లు వెనకేసుకున్నారు
- వరివేస్తే ఉరి అని రైతులను బెదరించారు
- సన్నవడ్లకు 500 బోనస్ ఇస్తున్నాం
- ప్రజాపాలన విజయోత్సవ సభలో సిఎం రేవంత్ రెడ్డి

వరంగల్,**డిసెంబర్5 ప్రజావినికిడి,**
బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉండగా గత పదేళ్లలో భారీగా ఆస్తులు సంపాదించారు.. కానీ ఈ ప్రాంతం అభివృద్ధిని గాలికి వదిలేశారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ ఆనాడు వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లేనని అన్నారు.. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం.. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ.. వరికి ప్రోత్సాహకాలిచ్చామని తెలిపారు. మిగతాది 2లో...



# చమురు రవాణా ఆగదు..!

## భారత్‌తో బంధం మరింత బలోపేతం



- భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం
- ఇరుదేశాల మధ్య మరింత వాణిజ్య సహకారం
- సొంత కరెన్సీలతో వ్యాపారానికి చేరువగా ఉన్నాం
- అణువిద్యుత్ తదితర రంగాల్లో సహకారం కొనసాగిస్తాం
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలసి నడుస్తాం
- ఉక్రెయిన్‌తో యుద్ధంపై మోడీ సూచనలు స్వాగతిస్తున్నాం
- మోడీతో భేటీలో సంయుక్త మీడియా సమావేశంలో పుతిన్



న్యూఢిల్లీ,**డిసెంబర్5 ప్రజావినికిడి,**
టెర్రరిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భారత్‌తో కలిసి నడుస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. టెర్రరిజాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు భారత్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ, పుతిన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ.. 'మోదీతో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. భారత్ ఆతిథ్యం ఎంతో సంతోషాన్నిచ్చింది మిగతా 2లో.



# వాహన, గృహ రుణదారులకు ఊరట..

- వడ్డీ రేట్లను తగ్గించిన ఆర్‌బీఐ
- రెపో రేటును 0.25 శాతం తగ్గించిన ఆర్‌బీఐ
- 5.5 శాతం నుంచి 5.25 శాతానికి చేరిన వడ్డీ రేటు
- ఆర్థిక వ్యవస్థలోకి లక్ష కోట్ల నగదు పంపిణీకి నిర్ణయం
- దేశ జీడీపీ వృద్ధి అంచనా 7.3 శాతానికి పెంపు

న్యూఢిల్లీ,**డిసెంబర్5 ప్రజావినికిడి,**
భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిచ్చే దిశగా భారత రిజర్వ్ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. కీలకమైన రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు (0.25%) తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన జరిగిన ద్రవ్య పరపతి కమిటీ సమావేశంలో మిగతా 2లో.

# ఇండిగో సంక్షోభంపై దర్యాప్తు

- రంగంలోకి దిగిన కేంద్రప్రభుత్వం
- సర్వీసుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు
- కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు




న్యూఢిల్లీ,**డిసెంబర్: 5:**
ఇండిగో సంక్షోభంపై విచారణకు కేంద్రం ఆదేశించింది. సంక్షోభం నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు వెంటనే కేంద్రం రంగంలోకి దిగింది. మిగతా 2లో.

# మధ్యతరగతికీ తక్కువ ధరకు ఇండ్లు

- ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మా లక్ష్యం
- హెల్ట్ పాలసీపై కెటిఆర్‌వి అర్థం లేని విమర్శలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్,**డిసెంబర్5 ప్రజావినికిడి,**
తమ ప్రభుత్వం వచ్చాక పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కేటాయించే బాధ్యత తీసుకున్నట్లు పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాంమిగతాది 2లో...



# చంద్రబాబును కలిసిన మంత్రి కోమటిరెడ్డి

## గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వాన పత్రిక అందచేత

అమరావతి,**డిసెంబర్5 ప్రజావినికిడి,**
చంద్రబాబు విజన్‌కి తగ్గట్టు అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్‌గా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించేందుకు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు.మిగతాది 2లో...

# దేవాలయాల సంపద దేవుడిదే.. బ్యాంకులకు వాడొద్దు

## : సుప్రీంకోర్టు సంచలన తీర్పు

- గుడి డబ్బును సహకార బ్యాంకుల కోసం వాడరాదని ఆదేశం
- కేరళ హైకోర్టు తీర్పును సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం
- ప్రజల నమ్మకాన్ని బ్యాంకులు చూరగొనాలని జస్టిస్ సూర్యకాంత్ హితవు



న్యూఢిల్లీ,**డిసెంబర్5 ప్రజావినికిడి,**
దేవాలయాల ఆస్తులు, సంపదకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం ఒక సంచలన తీర్పు వెలువరించింది. ఆలయాల సంపద దేవుడికే చెందుతుందని, దాన్ని సహకార బ్యాంకుల మనుగడ కోసం వినియోగించరాదని మిగతా 2లో.

# కెసిఆర్‌తో ఏకగ్రీవ సర్పంచ్‌ల భేటీ

## మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే అని వ్యాఖ్య

గజ్వేల్,**డిసెంబర్5 ప్రజావినికిడి,**
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల జోష్ ఊపందుకుంది. తొలి విడత పోలింగ్ ఈ నెల 11న జరుగనున్నది. అయితే పలు గ్రామాల్లోని ప్రజలు తమ గ్రామం అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. ఈ క్రమంలో ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామ పంచాయతీలకు సర్పంచ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఏకగ్రీవంగా ఎన్నికైన ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామ పంచాయతీల సర్పంచులు కలిశారు.మిగతాది 2లో...



# ఏపీలో యూనివర్సల్ హెల్త్ పాలసీ..

## రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం

- పేద కుటుంబాలకు రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం
- హైబ్రిడ్ మోడ్‌లో ఎన్టీఆర్ వైద్యసేవకు టెండర్ల ఆహ్వానం
- రాష్ట్రంలో 1.63 కోట్ల కుటుంబాలకు లబ్ధి

**డిసెంబర్5 ప్రజావినికిడి,**
రాష్ట్రంలోని ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' అమలుకు తొలి అడుగు పడింది. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి ఆరోగ్య భరోసా కల్పించే ఈ పథకం కింద రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు మిగతా 2లో.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# చమురు రవాణా ఆగదు..!



.(మొదటి పేజీ తరువాయి)

అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య అవగాహన కుదిరింది. విభిన్న అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నాం. భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది. ఇరుదేశాల మధ్య ట్రేడ్ మరింత పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయిల్ సహా అన్ని రంగాల్లో సహకారం అందిస్తాం. ఉమ్మడి ప్రాజెక్టులు, సాంకేతిక అంశాల్లో పరస్పర సహకారం ఉంటుంది. సొంత కరెన్సీల్లో ఇరుదేశాల మధ్య వాణిజ్యం జరుగుతోంది. కొడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టుకు సహకరిస్తాం. విద్యుత్ రంగంలో ఖర్చు తగ్గింపునకు సాయం అందిస్తాం. భారత్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్‌కు నిరంతరంగా ఇంధనాన్ని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందని అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. వచ్చే ఏడాది భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందన్నారు. భారత్‌కు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామన్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి ప్రధాని మోదీ ఎంతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. యుద్ధం ఆపే ప్లాన్ గురించి తనకు వివరించి చెప్పారని అన్నారు. అమెరికా లాంటి దేశాల నుంచి వాణిజ్య ఒత్తిడులు ఎదురైతున్నప్పటికీ .. భారత్- రష్యా మధ్య ఇంధన సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల నుంచి వస్తున్న ఒత్తిడుల కారణంగా కొంతకాలంగా చమురు దిగుమతులను భారత్ తగ్గించినప్పటికీ.. ఆ దేశాభివృద్ధికి సహకరించడం కోసం సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గతేడాది భారత్-రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి.. రికార్డు సృష్టించిందని రష్యా అధ్యక్షుడు అన్నారు. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో పెరుగుదల ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సహకారాన్ని కూడా మరింత విస్తరిస్తామని తెలిపారు. రష్యా దృష్టి పెట్టాల్సిన కీలక సవాళ్ల గురించి మోదీ తనతో చర్చించారని.. భారత్- యురేషియా ఆర్థిక సంఘం మధ్య స్వేచ్ఛా వాణిజ్య మండలాన్ని సృష్టించడం వంటి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. అంతే కాకుండా భారత్-రష్యా క్రమంగా చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులు తున్నాయని.. దాదాపు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీయ కరెన్సీలలోనే జరుగుతున్నాయన్నారు. మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరుకు భారత్- రష్యా కలిసి నడుస్తాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గతేడాది రష్యా రాజధాని మాస్కో లోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువలపై చేస్తున్న ఈ ప్రత్యక్ష దాడులకు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై పోరుకు ఇరుదేశాలు ఏకమైనట్లు తెలిపారు. భారత్, రష్యా, యూఎన్, జీ20, బ్రిక్స్ వేదికలు సన్నిహిత సహకారాన్ని కలిగి ఉన్నాయని.. ఈ వేదికలన్నింటిలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని కొనసాగిస్తామన్నారు.

# ఇండిగో సంక్షోభంపై దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణాపరమైన లోపాల కారణంగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దాంతో వేలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతుండగా.. ఈ గందరగోళం ఇప్పుడప్పుడే కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగింది. శుక్రవారం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా ఈ విచారణలో భాగంగా అధికారులు సిఫార్సులు చేయనున్నారు. ఇక ప్రస్తుత పరిస్థితులపై పౌరవిమానయాన శాఖ నిరంతరం సమీక్ష జరుపుతోంది. విమాన కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్లు అందించేలా 24/7 అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. విమానయాన సంస్థలతో సమన్వయం, ప్రస్తుత సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో దీనిని అందుబాటులోకి తెచ్చారు. కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయాల్సిన నంబర్లు 011-24610843, 011-24693963, 096503-91859 అని తెలిపింది. ఈ క్రమంలో ఇండిగో సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు నిర్ణయించినట్టు తెలిపింది. సంక్షోభానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గత నాలుగైదు రోజులుగా ఇండిగో విమాన సర్వీసుల సామూహిక రద్దుతో తలెత్తిన సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్ర విమానయాన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇండిగో సర్వీసుల్లో ఎక్కడ పొరపాటు జరిగింది, ఇందుకు బాధ్యులెవరనేది దర్యాప్తులో గుర్తించి, అవరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. భవిష్యత్తుల్లో ఇలాంటి అంతరాయాలు తలెత్తకుండా, ప్రయాణికులకు కష్టం కలకుండా చూస్తామని వివరించింది. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేదని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, పేషెంట్లు, ఇతరులు అ÷-జగ్గ÷ంట్ అవసరాల కోసం ప్రయాణాలు సాగిస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సి ఉంటుందని పేర్కొంది. ÷÷-లట్ సర్వీసులు శనివారం నుంచి తిరిగి ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నామని, మూడు రోజుల్లోగా పూర్తిగా పునరుద్ధిస్తామని తెలిపింది.కాగా, నలుగురు సభ్యులతో కూడిన దర్యాప్తు కమిటీని కేంద్రం పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఇండిగో ఫ్లైట్స్‌కు కలిగిన తీవ్ర అంతరాయం, ఇందుకు దారితీసిన పరిస్థితులపై కమిటీ దర్యాప్తు చేసి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించనుంది.

# చంద్రబాబును కలిసిన మంత్రి కోమటిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్‌పై అప్పటి పరిస్థితుల మేరకు వ్యాఖ్యలు చేశా.. ఇప్పుడు చంద్రబాబును ఆహ్వానించడానికి వచ్చా. రెండు రాష్ట్రాలు కలిసి ఉండాలి.. అదే స్నేహం కొనసాగాలి. చంద్రబాబు విజన్ 2020 అభివృద్ధికి ప్రతిరూపం హైదరాబాద్ అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం కలిశారు. ఉండవల్లిలో చంద్రబాబు నివాసంలో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబును ఆహ్వానించారు. అనంతరం ఇరు రాష్ట్రాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబును ఆహ్వానించేందుకు తాను అమరావతికి వచ్చానని తెలిపారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ఏర్పాటయ్యాక పక్కనే రహేజా మైండ్ స్పేస్‌లో ఐదు లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వివరించారు. బెంగళూరు తర్వాత హైదరాబాద్ ఐటీ రంగంలో రెండో స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తోందని.. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల సీఎంలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.ఇందులో భాగంగా ఏపీ ముఖ్యమంత్రి, సీనియర్ నేత చంద్రబాబు నాయుడును ఆహ్వానించేందుకు వచ్చానని తెలిపారు. సీఎం చంద్రబాబు తప్పకుండా సమ్మిట్‌కు హాజరవుతారనే తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో కోకాపేట ఏరియాలో భూముల విలువ రూ.100 కోట్లు పలుకుతున్నాయని వివరించారు. అందుకే ఆదిభట్ల వద్ద ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఇప్పుడు ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థుల్లో స్కిల్స్ ఉండటం లేదని... వారికి పలు అంశాలపై అవగాహన కల్పించేలా తమ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు

-----------

# దేవాలయాల సంపద దేవుడిదే..

(మొదటి పేజీ తరువాయి)

సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ ఈ ఆదేశాలు జారీ చేసింది.దేవాలయానికి చెందిన డిపాజిట్లను తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు ఆదేశించడాన్ని సవాలు చేస్తూ అక్కడి సహకార బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా కేరళ హైకోర్టు తీర్పులో ఎలాంటి పొరపాటు లేదని ధర్మాసనం అభిప్రాయపడింది.ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "సహకార బ్యాంకులను కాపాడటానికి గుడి డబ్బును ఉపయోగిస్తారా? దేవుడి డబ్బు కేవలం ఆలయ ప్రయోజనాల కోసమే వాడాలి. అది బ్యాంకులకు ఆదాయ మార్గం కాకూడదు" అని ఆయన అన్నారు. కస్టమర్ల నుంచి డిపాజిట్లు రాబట్టుకోలేకపోవడం అనేది సహకార బ్యాంకుల సమస్య... అందుకు దేవుడి సొమ్మును వాడటం సరికాదని హితవు పలికారు.ప్రజల నుంచి నమ్మకాన్ని పొందడంలో బ్యాంకులు విఫలమైతే అది వాటి సమస్యేనని పేర్కొంటూ, సహకార బ్యాంకుల పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దేవాలయాల డిపాజిట్లను తిరిగి ఇవ్వాల్సిందేనని స్పష్టం చేస్తూ కేరళ హైకోర్టు తీర్పును సమర్థించింది.

# వాహన, గృహ రుణదారులకు ఊరట..

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ తగ్గింపుతో రెపో రేటు 5.5 శాతం నుంచి 5.25 శాతానికి తగ్గింది.ఈ సందర్భంగా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థలో నగదు లభ్యతను పెంచేందుకు మరిన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ల ద్వారా లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. దీనికి అదనంగా 5 బిలియన్ డాలర్ల విలువైన డాలర్-రూపాయి స్వాప్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఆర్థిక వృద్ధి 8.2 శాతానికి చేరడం, ద్రవ్యోల్బణం 1.7 శాతానికి పడిపోవడం భారత ఆర్థిక వ్యవస్థకు 'గోల్డెన్ పీరియడ్' అని ఆయన అభివర్ణించారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం వల్లే వృద్ధికి మద్దతుగా వడ్డీ రేట్ల కోతకు అవకాశం లభించిందని వివరించారు. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో దేశ జీడీపీ వృద్ధి అంచనాను కూడా 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది.ద్రవ్య విధానంలో తటస్థ వైఖరిని కొనసాగించాలని నిర్ణయించినట్లు మల్హోత్రా స్పష్టం చేశారు. ఆగస్టు, అక్టోబర్ నెలల్లో జరిగిన సమీక్షల్లో ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదని గుర్తుచేశారు. దేశ విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరాయని, ఇది 11 నెలల దిగుమతులకు సరిపోతుందని తెలిపారు. అయితే, ప్రపంచ వాణిజ్య అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆర్థిక వ్యవస్థకు ప్రతికూల అంశాలుగా కొనసాగుతున్నాయని హెచ్చరించారు.ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించడం వల్ల బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రయోజనాలను వాణిజ్య బ్యాంకులు ఎంత వేగంగా వినియోగదారులకు అందిస్తాయన్న దానిపైనే అసలైన ఫలితం ఆధారపడి ఉంటుంది.

# ఏపీలో యూనివర్సల్ హెల్త్ పాలసీ..

(మొదటి పేజీ తరువాయి)

అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎన్టీఆర్ వైద్య సేవ - ఏబీపీఎంజేఏవై పథకాన్ని హైబ్రిడ్ మోడ్‌లో అమలు చేయడానికి టెండర్లను ఆహ్వానించింది.ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విధానం ప్రకారం, వార్షికాదాయం రూ. 5 లక్షలలోపు ఉన్న నిరుపేద కుటుంబాలకు రూ. 2.50 లక్షల వరకు ఇన్సూరెన్స్ మోడ్‌లో వైద్యం అందిస్తారు. ఒకవేళ వైద్య ఖర్చులు ఆ పరిమితి దాటితే, రూ. 25 లక్షల వరకు అయ్యే అదనపు ఖర్చును ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ భరిస్తుంది. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న (ఏపీఎల్) కుటుంబాలకు రూ. 2.50 లక్షల వరకు ఇన్సూరెన్స్ వర్తిస్తుంది.ఈ పథకం అమలు కోసం టెండర్ నిబంధనలలో ప్రభుత్వం కొన్ని కీలక సవరణలు చేసింది. ఇన్సూరెన్స్ క్లెయిమ్ రేషియో 120 శాతం దాటితే, ప్రీమియంకు మించిన అదనపు ఖర్చును ట్రస్ట్, బీమా కంపెనీ చెరి సగం భరిస్తాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే 521 రకాల ప్రత్యేక సేవలకు అయ్యే ఖర్చును ముందుగా బీమా కంపెనీ చెల్లించి, ఆ తర్వాత ట్రస్ట్ నుంచి రీయింబర్స్‌మెంట్ పొందుతుంది.ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్), వర్కింగ్ జర్నలిస్ట్ స్కీమ్ మినహా రాష్ట్రంలోని మిగిలిన అన్ని కుటుంబాలు ఈ పాలసీకి అర్హులు. ఇప్పటికే పీఎంజేఏవై, ఎన్టీఆర్ వైద్యసేవ లబ్ధిదారులు కూడా ఇందులో చేరవచ్చు. ఈ యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలోని సుమారు 1.63 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నాం





(మొదటి పేజీ తరువాయి)

సన్న వడ్డుల పండిస్తే 500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. ఉచిత విద్యుత్ పేటెంట్ మా పార్టీదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత పాలకులు ఫాంహౌస్ లు కట్టుకున్నారు, విమానాలు కొన్నారు.. ఉద్యమగడ్డ వరంగల్ కు మాత్రం ఏమీ ఇవ్వలేదని ఘాటు విమర్శలు చేశారు. గత పాలకులు రైతు రుణమాఫీ చేయలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసింది.. రాష్ట్రంలో కోటి 10 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం.. 3 కోట్ల 10 లక్షల మందికి ఈ ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయం కోసం గత సీఎం కేసీఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి కొత్తగా ఒక్క ఎయిర్‌పోర్టు ను కూడా సాధించలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో పర్యటించారు. రూ.532 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నర్సంపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. వరంగల్ గడ్డకు చెందిన ఎందరో వీరులు తమ పరాక్రమాన్ని ప్రపంచానికి చూపారు. కాకతీయ యూనివర్సిటీ పోరాటాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తాయి. తెలంగాణ వస్తే.. సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ జిల్లా ప్రజలు ఆశించారు. కుర్చీలో కూర్చున్న వారి ఆస్తులు పెరిగాయి కానీ, ప్రజల జీవితాలు మారలేదు. మీ ఓటునే ఆయుధంగా మార్చి.. గడీల పాలనను కూల్చారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తవుతోంది. వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్టే అని ఆనాటి సీఎం కేసీఆర్ అన్నారు. ఈ ప్రభుత్వం మాత్రం.. రైతు పండించిన చివరి గింజ వరకు కొంటోంది. కాంగ్రెస్ వస్తే.. కరెంట్ ఉండదని ఆనాటి సీఎం దుష్ప్రచారం చేశారు. రైతు బంధు బంద్ అవుతుందని ప్రజలను బెదిరించారు. కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చాక.. రాష్ట్రాన్ని దోచుకున్న వారి పవర్ మాత్రమ్ కట్ అయ్యింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పై పేటెంట్ హక్కు ఉన్నది కాంగ్రెస్‌కు మాత్రమే. గత సీజన్‌లో 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లను రైతు భరోసా కింద ఇచ్చాం. ఈ దేశంలో వరి అత్యధికంగా పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా

ఇవ్వలేదు. రాష్ట్రంలో 1.10 కోట్ల రేషన్ కార్డుల ద్వారా.. 3.10 కోట్ల మంది లబ్దిదారులకు సన్నబియ్యం ఇస్తున్నాం. రేషన్ కార్డుల్లో కొత్తవారికి చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించాం. సన్నబియ్యం ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నాం అని సీఎం అన్నారు. రేవంత్ తో సహా వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి. వరంగల్ ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు సీఎం రేవంత్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సంపేటపై వరాల జల్లు కురిపించారు సీఎం రేవంత్. రూ.532.24 కోట్లతో నర్సంపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు సీఎం. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ÷ఔ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, వసతి గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.÷ఔ.82.56 కోట్లతో హన్మకొండ-నర్సంపేట-మహబూబాబాద్ రోడ్డు విస్తరణ, మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ÷ఔ.17.28 కోట్లతో నర్సంపేట- పాఖాల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 56.40 కోట్లతో నర్సంపేట నుంచి నెక్కొండ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 20 కోట్లతో నర్సంపేట పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వైఎస్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి పేదవాళ్లకు ఇచ్చారు.. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చి పేదల్ని మోసం చేశారు.. పేదల ఆత్మ గౌరవం పెంచేందుకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం.. 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ కు ఏమేమి ఉన్నాయో వరంగల్ కు కూడా అవే తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మార్చి 31 లోపల వరంగల్ లో ఎయిర్ పోర్టును ప్రారంభించుకుంటామన్నారు. వరంగల్ లో అండర్ డ్రైనేజ్, ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించుకుంటాం.. సౌర విద్యుత్ ని ఉత్పత్తి చేసే బాధ్యతను మహిళలకు అప్పగించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.



# కెసిఆర్‌తో ఏకగ్రీవ సర్పంచ్‌ల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.తనను కలిసిన గ్రామస్తులతో కేసీఆర్ మాట్లాడుతూ.. మనకు అన్ని కాలాలు అనుకూలంగా వుండవని అన్నారు. కొన్ని కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయి వాటికి వెరవకూడదన్నారు. మల్లా మన ప్రభుత్వమే వస్తుంది. తెలంగాణ పల్లెలకు తిరిగి మంచిరోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పుడిదాకా ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో అధైర్య పడొద్దన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు నడవాలని సూచించారు. ఇప్పుడు నూతనంగా ఎన్నికైతున్న సర్పంచులు గొప్ప ఆలోచనలతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళికలు రచించుకోవాలన్నారు. గంగదేవిపల్లి లాంటి అభివృద్ధి చెందిన స్వయం సహాయక గ్రామాలను ఆదర్శంగా తీసుకొని, ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు వేసుకొని, మన పని మనం చేసుకుంటూ, మన ప్లలె అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఎవరో ఏదో చేస్తారని ఏదో ఇస్తారని ఆశలు పెట్టుకొని ఆగం కావద్దని కేసీఆర్ తెలిపారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో తమ ప్లలెలను సామాజిక ఆర్థిక స్వయం సమృద్ధి కేంద్రాలుగా తీర్చి దిద్దుకోవాలని కేసీఆర్ కోరారు.

# మధ్యతరగతికీ తక్కువ ధరకు ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడ జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో నిర్మిస్తాం. మధ్యతరగతి వర్గాలకూ మంజూరయ్యేలా చర్యలు చేపట్టాం. ప్రస్తుతం 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. త్వరలో లక్ష ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధం అవుతాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మూడు లక్షల ఇళ్లకు గృహప్రవేశం పూర్తి అవుతుందని వివరించారు. వచ్చే ఏప్రిల్ నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పుకొచ్చారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా ప్రణాళిక సిద్ధమైందని వెల్లడించారు. గ్రౌండ్ ప్లస్ ఫోర్ బిల్డింగ్ నిర్మించి పేదలకు ఇచ్చే ప్రణాళికలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో అర్బన్ ప్రణాళిక ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఓ ఆర్ ఆర్‌కు ఆనుకుని నలువైపులా ఉన్న స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్కో చోట 10వేల ఇళు నిర్మించి నో ప్రాఫిట్, నో లాస్ కింద మధ్యతరగతి ప్రజలకు ఇస్తామని వివరించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రణాళికలు ప్రకటిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గగత కేసీఆర్ ప్రభుత్వం హౌసింగ్ శాఖను నిర్వీర్యం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ శాఖను తిరిగి తాము బలోపేతం చేశామని వివరించారు. గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన ఇళ్లకు కూడా ఇందిరమ్మ పథకం వర్తింపజేయాలని తాము ఆలోచిస్తున్నామని చెప్పుకొచ్చారు. రూరల్‌లో, అర్బన్‌లో ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు కూడా త్వరలో శుభవార్త చెబుతామని పేర్కొన్నారు. ఒక విడతలోనే ఇళ్లు ఇచ్చి తాము చేతులు దులుపుకోమని చెప్పుకొచ్చారు. హిల్ట్‌పాలసీ పై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. హిల్ట్ పాలసీపై కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని అంటున్నారని... నోటికొచ్చినట్లుగా కేటీఆర్ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని.. వారి హయాంలో ఇష్టం వచ్చినట్లుగా చేశారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం చాలా వినూత్న నిర్ణయాలు తీసుకుంటుందని.. కేసీఆర్ హయాంలో లాగా తాము చేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

## : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ..



**కుత్బుల్లాపూర్ (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు వారు ఏర్పాటు చేసుకున్న అయ్యప్ప స్వామి మహా పడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి మహా పడి పూజా కార్యక్రమంలో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతల దేవేందర్,తాజా మాజీ కౌన్సిలర్ విష్ణు వర్ధన్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ బర్మ ప్రవీణ్,దుండిగల్ మునిసిపల్ యూత్ అధ్యక్షులు మైసిగారి శ్రీకాంత్,నాయకులు గంగయోల వెంకటేష్, బోగారం వెంకటేష్, గరిసె సతీష్,మంత్రి రఘునాథ్,గంగయోల రాకేష్,చింతల రాజు యాదవ్,పోశెట్టి భిక్షపతి,యాదగిరి యాదవ్,సాయినాథ్, స్థానిక నాయకులు,అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 7వ తేదీన ఇందిరా పార్క్ వద్ద జరగబోయే మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## :కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**శుక్రవారం రోజు బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అలాగే రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి హాజరు కావడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డిసెంబర్ 7వ తారీఖున ఇందిరాపార్క్ వద్ద జరగబోయే మహాధర్నా కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని పార్టీ పతాధికారులు, మోర్చాల అధ్యక్షులు, డివిజన్ కమిటీ సభ్యులు,శక్తి కేంద్రం ఇంచార్జ్ లు, నాయకులు, కార్యకర్తలు,అభిమానులు అందరూ భారీ ఎత్తున హాజరై మహాధర్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురాం నేత,శంకరయ్య గౌడ్, భూపాల్ రెడ్డి,శ్రీధర్ రావు,ప్రేమ్ నాథ్, జైపాల్ రెడ్డి,రవిశంకర్, మహేష్ గౌడ్,నందకిషోర్,చిత్రంజన్,శ్రీనివాస్ శర్మ,వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మహిళా నాయకురాలు దేవిక, నాయకులు మహేందర్ రెడ్డి,కాంతారావు, ప్రభాకర్ యాదవ్, రాజేంద్రప్రసాద్, నరసింహారెడ్డి,గోపి, రమేష్,మధుసూదన్ రెడ్డి,శ్రీనివాసరావు, కిషోర్,మురళి, విజయ్,సురేష్ కుమార్,భాను,శివకుమార్,సంజీవ,ఠాగూర్ తదితరులు ఉన్నారు.

# అయ్యప్ప పడిపూజా కార్యక్రమం లో పాల్గొన్నకార్పొరేటర్ రావుల శేషగిరి..



**(కుత్బుల్లాపూర్): ప్రజావినికిడి,**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలో చింతల్ డివిజన్ వివేకానంద నగర్ లో బసవరాజ్ స్వామి అయ్యప్ప స్వామి పడిపూజలో పాల్గొన్న బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి ఇతరులు ఉన్నారు.

# డ్రగ్స్‌పై యువతలో చైతన్యం తీసుకురావాలి: జి.నగేష్

## వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో నో డ్రగ్స్,నో ఆల్కహాల్, నో డ్రంక్ అండ్ డ్రైవ్‌పోస్టర్ ను ఆవిష్కరించిన నగేష్




**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**పెడదోవ పడుతున్న యువతలో అవగాహన కల్పించేందుకు వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ శేరిలింగంపల్లి నియోజవర్గం చైర్మన్ భారత ప్రసాద్ చేస్తున్న కృషి అభినందనీయమని వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ జి.నగేష్ అన్నారు. వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో నో డ్రగ్స్, నో ఆల్కహాల్,నో డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో సమరాన్ని ప్రకటించింది.వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ శేరిలింగంపల్లి నియోజకవర్గం చైర్మన్ భారత ప్రసాద్ ఆధ్వర్యంలో నో డ్రగ్స్, మద్యం నుండి యువతను కాపాడుకుందాం.. నవభారతాన్ని నిర్మించుకుందాం..
పేరుతో రూపొందించిన పోస్టర్ ను జి.నగేష్ శుక్రవారం ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురంలో లాంఛనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జి.నగేష్ మాట్లాడుతూ, యువతలో డ్రగ్స్‌పై, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా వారిలో చైతన్యం తీసుకురావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన పనులను చేపట్టాలి

## :బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**(కుత్బుల్లాపూర్): ప్రజావినికిడి,**
జీహెచ్ఎంసీ జంట సర్కిలైన కుత్బుల్లాపూర్ గాజులరామారం సర్కిల్ మున్సిపల్ కార్యాలయాలలో నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం 10 కోట్ల రూపాయలు మంజూరు కాగా, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో 3.50 కోట్ల రూపాయలు మంజూరవగా,జంట మున్సిపల్ సర్కిల్లో పరిధిలోని పలు కాలనీలలో చేపట్టవలసిన రోడ్డు నిర్మాణ పనులు, స్మశాన వాటికల అభివృద్ధి పనులు, పార్కుల అభివృద్ధిపై ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మంజూరైన నిధులతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు, స్మశానవాటికల అభివృద్ధి,పార్కుల అభివృద్ధి వంటి పనులలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా త్వరితగతిన పనులను చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో గాజుల రామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఈఈ లు,డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# కింగ్డమ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీ" 2026వ సంవత్సరం క్యాలండర్ ను ఆవిష్కరించిన బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**(కుత్బుల్లాపూర్): ప్రజావినికిడి,** 132 – జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద "కింగ్డమ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీ" ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన 2026వ సంవత్సర క్యాలెండర్ ను బిఆర్%వం% ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆవిష్కరించారు. అనంతరం ఈనెల 25వ తారీఖున నిర్వహించనున్న క్రిస్మస్ మహోత్సవానికి ఎమ్మెల్యే ని ఆహ్వానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిషప్ క్రీస్తు రాజు,పాస్టర్ సత్యనారాయణ, పాస్టర్ అమృత్ కుమార్,పాస్టర్ జాన్ వాతాడ,పాస్టర్ ఆంథోని,శకుంతల, వరలక్ష్మి,లక్ష్మి ఎస్తేరు రాణి,సుధీర్,ప్రకాష్ కుమార్,ప్రశాంత్, జాషువా,సువర్ణ,రిషి వర్మ,భాస్కర్,సన్నీ, డేని,నాగరాజు, ఆనంద్, కేసిఎం సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# తలకొండపల్లి రిపోర్టర్ రాజేందర్ గుండెపోటుతో మృతి

## నివాళులర్పించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నేతలు..



**ప్రజావినికిడి,(రంగారెడ్డి):డిసెంబర్ 05:**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెట్రో ఈవినింగ్ దినపత్రిక రిపోర్టర్ తకేలపల్లి రాజేందర్ శుక్రవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు.ఆయన వయసు 42 సంవత్సరాలు. రాజేందర్ కు భార్య, ముగ్గురు చిన్నపిల్లలు.గత ఏడేండ్లుగా రిపోర్టర్ గా పనిచేస్తున్న రాజేందర్ కు శుక్రవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో చికిత్స కోసం కల్వకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, కో కన్వీనర్ పులిపలుపుల ఆనందం,రంగారెడ్డి జిల్లా టిడబ్ల్యుజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెల సత్యనారాయణ తదితరులు రాజేందర్ స్వగ్రామం గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని ఆయన ఇంటికి వెళ్ళి రాజేందర్ భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ,ఈ మధ్యకాలంలో అనారోగ్య సమస్యలతో అనేకమంది జర్నలిస్టులు పిట్టల్లా రాలిపోతున్నారని, అయినా కూడా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల జర్నలిస్టులకు వైద్యం అందక చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి కార్పొరేట్ ప్రైవేటు ఆసుపత్రిలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాజేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్ బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్ కార్యదర్శి తిరుపతి సభ్యులు సహాయ కార్యదర్శి తూర్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.





# విశాఖ నగరంలో స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ!



**ప్రజావినికిడి,(విశాఖపట్నం):**
స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ వారు,పది రోజులుగా, తెలుగు రాష్ట్రాల్లో చేపట్టిన,దుప్పట్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా, గురువారం అర్ధరాత్రి,వైజాగ్ లోని, గోపాలపట్నం నుండి, జ్ఞానేశ్వరం రైల్వే స్టేషన్ కు వెళ్లే దారి పొడవునా,ఫుట్ పాత్ లపై నిదురించే అనాధలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.పలు ప్రాంతాలలో అనాధలు దుప్పట్లు లేకుండా నిద్రిస్తూ ఉన్నవారికి, ట్రస్టు వారు దుప్పట్లను కప్పారు.ఆశ్చర్యంగా, అర్ధరాత్రి సమయంలో, ట్రస్టు సభ్యులతో పాటు,వారి కుటుంబ సభ్యులు అయిన చిన్నారులు సైతం,ఈ సేవా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు,శ్రీ దుడ్డు వీర్రాజు,వారి శ్రీమతి స్వాతి,వారి పిల్లలు అక్షిత్,సాత్విక, అదేవిధంగా టీం మెంబర్స్ శ్రవంత్,అవినాష్, పాల్గొన్నారు.

# జోరుగా సర్పంచ్ ఎన్నికల్లో ప్రచారం

## కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి

## సర్పంచ్ అభ్యర్థి మైలారం వనమాల కృష్ణ

ప్రజావినికిడి, (శంషాబాద్):డిసెంబర్ 5:శంషాబాద్ మండలం నానాజపురం గ్రామంలో కత్తెర గుర్తుపై సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వనమాల కృష్ణ శుక్రవారం నాడు గ్రామంలోని అన్ని బస్తీల్లో తిరుగుతూ విరి విగ ప్రచారం చేస్తున్నారు తన కత్తెరగుర్తును అందరికీ చూపిస్తూ తప్పకుండా కత్తెర గుర్తుపై ఓటు వేసి తనను సర్పంచ్ గా గెలిపించాలని అభ్యర్థిస్తున్నాను గ్రామంలో సమస్యలన్నింటినీ ఒక్కటి ఒక్కటిగా గుర్తించి వాటన్నింటికీ అంచలంచలుగా పరిష్కారం చేసి గ్రామాన్ని శంషాబాద్ మండలంలోని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతానని ఆమె చెప్పారు గ్రామంలోని రైతులు వ్యవసాయ కూలీలు ఇతర వర్గాల కార్మికులు అందరూ తనకు మద్దతు పలుకుతున్నారని ముఖ్యంగా మహిళలందరూ ఎంతో సంతోషంతో ప్రచారంలో పాల్గొంటున్నారని వారందరి ఆశీస్సులు తనకు లభిస్తున్నాయి గనుక తను ఈ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తానని ఆశ కలుగుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు ఇక గ్రూపు మహిళలు కూడా తన విజయానికి ప్రచారం చేయడానికి ముందుకు రావడం ఎంతో సంతోషదాయకం అన్నారు ఈ నెల 11వ తేదీన జరగనున్న ఎన్నికల్లో కత్తెర గుర్తుపై ఓటు వేసి తనను బారీమెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు.ఈ ప్రచారంలో స్థానిక నాయకులు సింహ రెడ్డి తోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.





ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# సీజ్ చేసిన ఆగని
# అక్రమ నిర్మాణాలు..

**జిహెచ్ఎంసి అధికారుల పనితీరుకు నిదర్శనం ఈ అక్రమ నిర్మాణాలు.. -భవనాలు సీజ్ చేసేది సెటిల్మెంట్ కోసమేనా..?**

**సీజ్ పేరుతో జిహెచ్ఎంసి పరిధిలో డిప్యూటీ కమిషనర్లకు, ఏసీపీలకు,సెక్షన్ ఆఫీసర్లకు కాసులపంట..**

**సీస్ పేరుతో ప్రభుత్వ నిధులను దోచుకుంటున్న అధికారులు.. - జోన్ జోనల్ కమిషనర్ నిర్లక్ష్యమే అవినీతికి కారణమా.?**









**ప్రజావినికిడి (ముషీరాబాద్):**
ముషీరాబాద్ సర్కిల్లో అక్రమ నిర్మాణాలను మునిసిపల్ అధికారులు సీజ్ చేస్తున్న అక్రమ నిర్మాణదారులు మాత్రం యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంగిస్తూ నిర్మాణ పనులు కొనసాగిస్తున్నామునిసిపల్ అధికారుల అటు వైపు చూడకపోవటం ఏంటని,విధి నిర్వహణలో చిత్తశుధీ ఎంతుందో అర్థం అవుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియమనిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవలసిన అధికారులు లంచాలకు అమ్ముడుపోయి అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని ముషీరాబాద్ సర్కిల్ అధికారులపై స్థానికులు ఆరోపిస్తున్నారు.కనీస నియమనిబంధనలు అమలుపరచడంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్,టౌన్ ప్లానింగ్ ఏసిపి పూర్తిగా విఫలం చెందారని ఇక్కడ డబ్బుకు లోకం దాసోహం అన్న చందానంగ అధికారుల తీరు మారడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీజ్ చేసిన భవనాన్ని తిరిగి అక్రమ నిర్మాణదారుడు నిర్మాణ పనులు పూర్తి చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఇంత భారీగా అవినీతి అక్రమాలు జరుగుతుంటే జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసి కమిషనర్ ప్రభుత్వ పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.సీజ్ చేసిన భవనం వెనక ఓ భారీ ఆర్థిక లావాదేవీ జరిగిందని లక్షలలో అధికారులకు మామూళ్లు అందాయని అందుకోసమే సీజ్ చేసిన భవన నిర్మాణదారుడు యధావిధిగా నిర్మాణ పనులు చేస్తున్నాడని స్థానికులు విమర్శిస్తున్నారు.

**నిర్మాణ పనులు జరుగుతున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు ?**

డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు, ఏసీపి దేవేందర్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది వచ్చి దయారా మార్కెట్ వద్ద పక్కింటి నెంబర్ 1-7-540 భారీ అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు.ఇంతవరకు సీన్ బాగానే ఉంది తర్వాత అంతా లోలోపల జరిగిపోయిందా.? సీజ్ చేసిన తర్వాత పర్యవేక్షణ పూర్తిగ లేకపోవటానికి లంచాలే కారణమా..? ఏ అధికారికి ఎంత కావాలో అంత ముడుపులు అందాయా? అందుకోసమే సీజ్ చేసిన భవన పనులు పూర్తి చేసి రంగులు వేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. ఇదంతా అధికారుల పుణ్యమే కానీ ప్రభుత్వానికి మాత్రం పెద్ద టోకరు ఇస్తున్నారు నిధులు మింగేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరు ఎత్తనట్లు ఉంటున్నారు.మరి ఇప్పటికైనా దీనిపై సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, జిహెచ్ఎంసి కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## అంగరంగా వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ





**ప్రజావినికిడి,(రామంతపూర్): ప్రతినిధి,డిసెంబర్,5**
రామంతపూర్ డివిజన్ టీవీ కాలనీలో సత్తిరెడ్డి పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కన్నుల పండగ జరిగింది. ఈ పడిపూజ గురు స్వామి నాంబోద్రి సమక్షంలో అయ్యప్ప సంకీర్తనలు అభిషేకాలతో పూజలు ఘనంగా నిర్వహించారు. 100 మందికి పైగా అయ్యప్ప మాల ధారణ స్వాములు పాల్గొని పూజా కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణలో పాల్గొని సత్తిరెడ్డి పద్మావతి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు.

## ఘనంగా అనంతుల రాజిరెడ్డి చేతుల మీదుగా జై భవాని ఫుడ్ కోర్ట్ ఘనంగా ప్రారంభం






**ప్రజావినికిడి,(నాగోల్):ప్రతినిధి, డిసెంబర్,5**
నాగోల్ డివిజన్ పరిధిలోని జైపూరి కాలనీ చౌరస్తా లో నూతనంగా ఏర్పాటు చేసిన జై భవాని ఫుడ్ కోర్టును ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి హాజరై శుక్రవారం నాడు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులైన చిత్తల చెన్నయ్య,కర్ణాకర్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఫుడ్ కోర్ట్ లో టిఫిన్ మొదలు కొని భోజనం, బిర్యానీ,అన్ని రకాల ఫుడ్ ఐటమ్స్ లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూరి కాలనీ నాయకులు ఇతరులు పాల్గొన్నారు.

## ఉంగరం గుర్తుకు ఓటు వేసి నర్కుడ సర్పంచిగా
# శేఖర్ యాదవ్ ని గెలిపిద్దాం

**కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**





**ప్రజావినికిడి, (రాజేంద్రనగర్):** డిసెంబర్ 05,కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఉంగరం గుర్తు నర్కుడ గ్రామ సర్పంచ్ అభ్యర్థి గడ్డం శేఖర్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నర్కుడ గ్రామ సర్పంచ్ ఉంగరం గుర్తు అభ్యర్థి గడ్డం శేఖర్ యాదవ్ తో కలిసి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా రంజక పాలన అందిస్తున్నారని రాష్ట్రంలో 6 గ్యారంటీలు అమలవుతున్నాయని అన్నారు.నర్కుడ గ్రామ వాస్తవ్యులు గడ్డం శేఖర్ యాదవ్ గ్రామ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే వ్యక్తి అని గ్రామాన్ని కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే నాయకుడు ఆయనను మెజార్టీతో గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తారని అన్నారు.ప్రజలు గ్రామ సర్పంచ్ కి ఎన్నుకునే అభ్యర్థి గడ్డం శేఖర్ యాదవ్ ని గెలిపిస్తే గ్రామం మరింత అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నీరటి తన్వీరాజ్,సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, జాంగిర్ ఖాన్ తదితరులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చౌదర్ గూడ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుదాం

**మల్చలం లక్ష్మీ లింగం కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలి - రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**





**ప్రజావినికిడి, (రాజేంద్రనగర్): డిసెంబర్ 05,** చౌదర్ గూడ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుదాం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మల్చలం లక్ష్మీ లింగం కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలోని చౌదర్ గూడ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మల్చలం లక్ష్మీ లింగం కత్తెర గుర్తు తో పోటీ చేస్తున్న అభ్యర్థి తో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌదరిగుడ గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. తదనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా రంజక పాలన కొనసాగుతుందని గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే దిశగా ముఖ్యమంత్రి కోట్ల నిధులు కేటాయిస్తున్నారని ఆయన అన్నారు. చౌదరిగుడ గ్రామం సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే వ్యక్తిని గ్రామం కోసం పని చేసే వ్యక్తిని ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. మీ గ్రామ వ్యక్తిగా మల్చలం లక్ష్మీ లింగం సర్పంచి గా బరిలో ఉన్నందు న ప్రజలందరూ సర్పంచ్ అభ్యర్థి కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. గ్రామంలో ఏలాంటి సమస్యలు ఉన్న ఇబ్బందులు ఉన్న ఎన్నికల అయిన తర్వాత సత్వరమే వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. చౌదర్ గూడ సర్పంచ్ అభ్యర్థి మల్చలం లక్ష్మీ లింగం మాట్లాడుతూ చౌదర్ గూడ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మాట ఇస్తున్నానని అన్నారు. గ్రామంలో మంచినీటి సౌకర్యం, హెల్త్ క్యాంపులు,రోడ్డు రవాణా సౌకర్యాలు, అదేవిధంగా పారిశుధ్యం విషయంపై దృష్టి సాధించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మాట ఇస్తున్నానని,ప్రజా సంక్షేమం గ్రామ అభ్యుదయమే లక్ష్యంగా నిరంతరం మీరు ఆదరించి ఆశీర్వదిస్తే గ్రామ ప్రజల సేవ చేసుకునే అవకాశం కల్పించాలని చౌదరి గూ డా గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాలమాకుల లో జోరుగా
# సర్పంచ్ ఎన్నికల్లో ప్రచారం

**బ్యాట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలి**

**పాలమాకుల సర్పంచ్ అభ్యర్థి కోడావత్ రవీందర్**






**ప్రజావినికిడి,(శంషాబాద్):డిసెంబర్ 5:**శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలంటే బ్యాట్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోడావత్ రవీందర్ కోరారు. శుక్రవారం కోడావత్ రవీందర్ గ్రామంలోని వీధి వీధి తిరుగుతూ,ప్రజలను కలిసి తన బ్యాట్ గుర్తును ఓటర్లకు చూపిస్తూ బ్యాట్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. మీడియా సమావేశంలో కొడవత్ రవీందర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మద్దతు తనకే ఉందని కాంగ్రెస్ పార్టీ మద్దతు తనకే ఉందని చెప్తున్నారు. తన భార్య గతంలో ఎంపీటీసీగా, సర్పంచ్ గా పనిచేసిన అనుభవం తనకు ఉందని గ్రామంలోని సమస్యల కోసం తనకు తెలుసునని తాను గెలిస్తే తప్పకుండా గ్రామంలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు గతంలో సర్పంచిగా పనిచేసిన వారు ప్రజలను గురిచేసారని గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగనేలేదని ఆరోపించారు మరి తనను ప్రజలు బ్యాట్ గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే తప్పకుండా గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. బ్యాట్ గుర్తుపై ఓటు వేసి తప్పకుండా తనను గెలిపించాలని అభ్యర్థించారు.
గ్రామంలో సమస్యలు లేకుండా అభివృద్ధి చెందుతుందని ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు రోడ్డు డ్రైనేజీ సాగునీరు లాంటి కనీస సౌకర్యాలను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండేలాగా చేస్తానన్నార.గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎవరు ఎన్ని మాయ మాటలు చెప్పినా నమ్మకుండా అభివృద్ధి కోరుకునే ప్రజలు బ్యాట్ గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఆయన మద్దతుదారులు శ్రీనివాస్ యాదవ్ తోపాటుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సాయి ఈశ్వర్ మరణానాకి ప్రభుత్వానిదే బాధ్యత

**బిసి రిజర్వేషన్లతో మోసం వల్లే అతను ఆత్మహత్య**

**అతని కుటుంబానికి 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి**

**బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులు డిమాండ్**



హైదరాబాద్,**డిసెంబర్5 ప్రజావినికిడి,** : సాయిఈశ్వర్ మరణానాకి ప్రభుత్వానిదే బాధ్యతని బిఆర్ఎస్ ఆరోపించింది. బిసి రిజర్వేషన్ల పేరుతో మోసం చేయడం వల్లనే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని విమర్శించింది. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసానికి సాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సాయి ఈశ్వర్ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కులగణనను మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జీవోల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్‌కు సమాధి కట్టిందని కేటీఆర్ అన్నారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి ఆడిన రాక్షస రాజకీయ క్రీడలో తమ్ముడు సాయి ఈశ్వర్ బలైపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. బీసీ బిడ్డ ఆత్మబలిదానానికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీ సమాజం ఎన్నటికీ క్షమించదని తెలిపారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్య అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అధికార దాహానికి బలైన ప్రాణం ఇది అని పేర్కొన్నారు. సాయి ఈశ్వర్ ఆత్మకు శాంతి కూరాలని ఆ దేవుడిని హరీశ్‌రావు ప్రార్థించారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని సాయి ఈశ్వర్ ఇటీవల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తీన్మార్ మల్లన్నను కలవడానికి వెళ్లిన సాయిఈశ్వర్ గురువారం సాయంత్రం.. ఆయన ఆఫీసు ముందు పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు ÷రిరజన్, పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న వారు మంటలను ఆర్పివేసి సాయిఈశ్వర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయిఈశ్వర్ ప్రాణాలు కోల్పోయాడు.

-----

# మరో బాలుడిపై వీధికుక్క దాడి

హైదరాబాద్,**డిసెంబర్5 ప్రజావినికిడి,** : హైదరాబాద్‌లో మరో బాలుడిపై వీధి కుక్కలు దాడికి తెగబడ్డాయి. యూసుఫ్‌గూడ పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహనగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న మాన్వీత్ నందన్ అనే రెండేళ్ల చిన్నారిపై వీధి కుక్క దాడికి దిగింది. చిన్నారి చేతిని కరిచే ప్రయత్నం చేసింది. అక్కడే ఉన్న బాలుడి తాత అప్రమత్తమై కర్రతో కొట్టడంతో వీధికుక్క అక్కడి నుంచి వెళ్లిపోయింది. అనంతరం గాయాలపాలైన బాలుడిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, వీధికుక్కల విజృంభణపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో వీధి కుక్కల దాడులు జరుగుతున్నా, ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.

------

# నామినేషన్ల తీరును పరిశీలించిన అబ్జర్వర్

మెదక్,**డిసెంబర్5 ప్రజావినికిడి,** : నామినేషన్ల నిర్వహణపై సంబంధిత అధికారులు మరింత శ్రద్ధ వహించాలని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ భారతి లక్‌పతి నాయక్ అన్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో పంచాయతీ ఎన్నికల మూడో విడత నామినేషన్ల చివరి రోజు శుక్రవారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు భారతి లక్‌పతి నాయక్ ఆకస్మికంగా పరిశీలించారు.కౌంటర్ల వద్ద నామినేషన్ పక్రియను గమనించిన ఆమె, ఎన్నికల అధికారులతో మాట్లాడుతూ ఇప్పటివరకు వచ్చిన నామినేషన్ల సంఖ్య ఎంత, అభ్యర్థులకు టోకెన్ విధానం ఎలా అమలు చేస్తున్నారని, పత్రాల పరిశీలన ఎలా జరుగుతుందో వివరంగా అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, అభ్యర్థులు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలపై కూడా ఆరా తీశారు. ఎన్నికల నిర్వహణలో మరింత శ్రద్ధ వహించాలని ఆమె ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, డియస్‌పి నరేందర్ గౌడ్, సీఐ రంగా కృష్ణ, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఎంపీఓ తిరుపతి రెడ్డి, ఎస్సై మధుకర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

-----------------

# ఎవరిని సంప్రదించకుండానే లేబర్ కోడ్లు

## కేంద్రం తీరుపై మండిపడ్డ మాజీ ఎంపి వినోద్

హైదరాబాద్,**డిసెంబర్5 ప్రజావినికిడి,** కేంద్ర ప్రభుత్వం ఎవరిని సంప్రదించకుండానే నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. బీఆర్టీయూ అధక్షుడు రాంబాబు యాదవ్‌తో కలిసి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక చట్టాలను కుదించి 29 కు పరిమితం చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తెచ్చిందని మండిపడ్డారు. కార్మిక వర్గాలు ఈ కొత్త లేబర్ కోడ్స్‌పై ఆందోళనగా ఉన్నాయన్నారు. చట్టాలు పాస్ చేసే ముందు కార్మికు వర్గాల అభిప్రాయాన్ని కేంద్రం తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.చట్టాలకు నిబంధనలు రూపొందించే క్రమంలో ఇప్పుడు కేంద్రం అభిప్రాయం చెప్పమంటున్నది. బీఆర్ఎస్ పార్టీ తరపున లేబర్ కోడ్‌లపై అభిప్రాయాలు సేకరించి ఓ నిర్ణయం తీసుకునేందుకు రేపు తెలంగాణ భవన్‌లో ఉదయం పదకొండు గంటల నుంచి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల కార్మికు సంఘాల నేతలు, వివిధ పరిశ్రమల కార్మిక సంఘాల నాయకులు, అసంఘటిత రంగ కార్మిక సంఘాల నేతలు, బీఆర్ఎస్ కార్మిక విభాగం నేతలు ఈ రౌండ్ టేబుల్ మీటింగ్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

# అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న సిద్దు రెడ్డి

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ -శంషాబాద్ ప్రభుత్వ కళాశాల అభివృద్ధికై తనవంతుగా**

**వాలీబాల్ కోర్ట్, కళాశాల మరమ్మతులు,వాటర్ ఫిల్టర్,వాష్ రూమ్స్ ఏర్పాటు చేసిన ప్రముఖ సామాజికవేత్త కందకట్ల సిద్దురెడ్డి..**





**ప్రజావినికిడి, (శంషాబాద్):డిసెంబర్ 5,**కందకట్ల సిద్దురెడ్డి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. సిద్దురెడ్డి ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,ఏఆర్ఐ ఇఫ్తెకర్ షరీఫ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ సిదద్దు రెడ్డి తాను పుట్టిన ఈ గ్రామంలో గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం బాత్రూంలు కట్టించడం అలాగే అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు కలిగిన బాస్కెట్ బాల్ గ్రౌండ్ ఏర్పాటు చేయడం తాగడానికి స్వచ్ఛమైన తాగునీరు అందించే ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషనీయమన్నారుఅలాగే ధనం చాలా మంది వద్ద ఉంటుంది కానీ ప్రజలకు సహాయం చేయాలని సిద్దు రెడ్డి లాంటి కొంతమందికే ఉంటుంది వారు ముందుకు వచ్చి ఇలా ప్రజలకు విద్యార్థులకు ఉపయోగపడే పనులు చేపట్టడం చాలా విశేషం అన్నారు సిద్దు రెడ్డి శంషాబాద్ లోనే కాదు పాలమాకుల, కాచారం,సిద్ధాంతి పాఠశాల లు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన వసతులను ఏర్పాటు చేశారని కొనిఆడారు ఆయనను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు వచ్చి ప్రభుత్వ కళాశాలలో పాఠశాలలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి ఆదర్శంగా ఉండాలని సిద్దు రెడ్డి మాట్లాడుతూ,తన తల్లి తనను చదివించే కాలంలో పాఠశాలలో ఎన్నో వసతులు ఉండేవి కావని ఏ మహానుభావుడు వచ్చి సహాయం చేసి సౌకర్యాలు సమకూరుస్తాడని ఎదురుచూసిన ఎవరు ముందుకు రాలేదని అప్పుడే నిర్ణయించుకున్నానని పెద్దయ్యాక తనకు స్తోమత వస్తే ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని నిశ్చయించుకున్నాను అన్నాడు అలాగే తనకు వ్యాపారంలో కలిసి వచ్చి తాను స్థిరపడిన తర్వాత ఏదో కొంత సహాయం చేయాలని సిద్దు రెడ్డి ఉద్దేశంతో పాఠశాలలు కళాశాలల్లో వసతులు ఏర్పాటు చేయగలిగానని వీటిని ఆదరించి యువత కూడా ముందుకు వచ్చి తమకు తోచినంత రీతిలో సహాయం చేస్తే తనకు మరింత సంతోషం కలుగుతుందన్నారు. స్థానిక ఎన్నారై డ్యూయల్ సిటిజన్ అవార్డు గ్రహీత ఇష్టమా షరీఫ్ మాట్లాడుతూ, సింధు రెడ్డి అందించిన సేవలను కొనియాడారు. కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినీ విద్యార్థులు మాట్లాడుతూ,సింధు రెడ్డిని తమ ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల్లో సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ మహేందర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ జాంగిర్ ఖాన్ తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# చదువుకు మీడియం అడ్డంకి కాదు

**గురువును దైవంగా భావించే సంస్కృతి మనది**

**మనపై ఉపాధ్యాయుల ప్రభావమే ఎక్కువ**

**చిలకలూరిపేట పేరెంట్స్ మీట్‌లో పవన్ కళ్యాణ్**



పల్నాడు,**డిసెంబర్5 ప్రజావినికిడి,** గురువును దైవంగా భావించే అరుదైన సంస్కృతి మనదని, తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయులే మనల్ని ఎక్కువగా ప్రభావితం చేస్తారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. చదువు చాలా బలమైన ఆయుధమని, లక్ష మెదల్లను కదిలించే శక్తి విద్యకు మాత్రమే సాధ్యమని అన్నారు. ఏ మాధ్యమంలో చదివామనేది ముఖ్యం కాదని.. విభిన్న అంశాలపై పట్టు సాధించడం ముఖ్యమని సూచించారు. అబ్దుల్ కలాం వంటి వారు తమిళ మాధ్యమంలో చదివి మిసైల్ మ్యాన్‌గా, రాష్టపతిగా ఎదిగారని గుర్తుచేశారు. చిలకలూరిపేట ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సమావేశాలు నిర్వహించాలన్న మంత్రి లోకేష్ ఆలోచన అద్భుతమని డిప్యూటీ సీఎం ప్రసంసించారు. మైలవరపు కృష్ణ తేజ తాతగారు గుండయ్య పేరుతో కూడలి ఉండటం ఆయన సేవా నిరతిని గుర్తు చేసిందన్నారు. అప్పట్లో పెద్దలు పాఠశాలలకు స్థలాలు ఇచ్చేవారని, కానీ ఇప్పుడు కొందరు స్థలాలు లాక్కుంటున్నారని అగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలోనే పవన్ కళ్యాణ్ పలు కీలక విషయాల గురించి మాట్లాడారు. పిఠాపురంలో విద్యార్థుల మధ్య చిన్న గొడవను కులాలకు అంటగట్టారని మండిపడ్డారు. కేరళలో తల్లిదండ్రుల సంఘాలు చాలా బలంగా ఉంటాయని, క్రియాశీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి సమావేశాల కారణంగా పిల్లల బలాబలాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. తల్లికి వందనం కార్యక్రమం 67 లక్షల మందికి అందించినట్లు తెలిపారు. పిల్లలు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ చాలా అద్భుతంగా ఉందని, వారు తయారు చేసిన పరికరాలు నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. స్కూల్ క్రీడా మైదానం సరిపోవడం లేదని విద్యార్థులు తన దృష్టికి తెచ్చారని, క్రీడా మైదానం సమకూర్చే విషయం విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలించాలని అన్నారు. గ్రంథాలయంలో పిల్లల సంఖ్యకు సరిపడా పుస్తకాలు లేవని, తన వైపు నుంచి పూర్తి స్థాయి గ్రంథాలయం ఏర్పాటు చేసి పుస్తకాలు అందిస్తానని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. పిల్లల ఆలోచనలు మెరుగు పర్చటానికి లైబ్రరీ ఎంతో అవసరమని, ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు జనసేన నేతలు, కార్యకర్తలు చేయూత అందించాలని కోరారు. పాఠశాలలో పది కంప్యూటర్లు మాత్రమే ఉన్నాయని, తన వైపు నుంచి 25 కంప్యూటర్లు పంపిస్తానని స్పష్టం చేశారు. బాలికలకు ఆత్మరక్షణ విద్య చాలా ముఖ్యమన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహారం చాలా అవసరమని వివరించారు. చిన్నప్పుడు సోషల్ టీచర్ చెప్పిన అంశాలు తనన్ను ఇప్పుడు బలంగా నిలబెట్టాయన్నారు. విద్యార్థులను భవిష్యత్తు కోసం తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు.మన జీవితాలను మార్చిన శాస్త్రవేత్తలను గుర్తు పెట్టుకుని గౌరవించటం తన తల్లి నుంచి నేర్చుకున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిలోనూ నిగూఢమైన శక్తి ఉంటుందని వ్యాఖ్యానించారు. బూతులు మాట్లాడే రాజకీయ నాయకులను పట్టించుకోవద్దని, సినిమా కూడా చిన్న వినోదం మాత్రమేనని అన్నారు. మీ ఆలోచనలు, ప్రవర్తన మన దేశ భవిష్యత్తుని నిర్ణయిస్తాయన్నారు. స్థలాలు లాక్కునే వారి వల్లే పిల్లలకు క్రీడా మైదానాలు దొరకటం లేదని, స్కూల్ గ్రౌండ్ ఏర్పాటు విషయం అధికారులు త్వరగా ఆలోచించాలని సూచించారు. ఈ క్రమంలోనే, మాదకద్రవ్యాలతో తీవ్ర అనర్థం జరుగుతుందని, యువత అటు వైపు అస్సలు చూడొద్దని కోరారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పోలీసులు దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు. గుంటూరు శేషేంద్ర శర్మ విద్యార్థుల భవిష్యత్తుపై రాసిన మాటలు స్ఫూర్తినిచ్చాయన్నారు. మనం సంపాదించినవి పోవచ్చు.. కానీ చదువు, జ్ఞానం ఎప్పటికి పోవని, వాటిని ఎవరూ దొంగిలించలేరని పేర్కొన్నారు. స్వయం వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పాఠాలు చెబితే ఎందరో సమర్థులు తయారవుతారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

# వివిధ రాష్ట్రా ల్లో గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికలు అందచేత



హైదరాబాద్,**డిసెంబర్5 ప్రజావినికిడి,**
ఈనెల 8,9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్ కు హాజరవ్వాలని వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన మంత్రులు ఆయా సిఎంలకు ఆహ్వానాలు అందించారు. డిప్యూటి సిఎం జా÷-ఖండ్ సిఎంను ఆహ్వానించారు. అలాగే జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను, తమిళనాడు సిఎం స్టాలిన్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. న్యూఢిల్లీలోని జమ్ముకశ్మీర్ హౌస్‌లో సీఎం ఒమర్ అబ్దుల్లాను శుక్రవారం మంత్రి ఉత్తమ్ కలిశారు. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన ఆహ్వాన పత్రికను జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు ఉత్తమ్ కుమార్ రెడ్డి అందజేశారు. అలాగే స్టాలన్‌కు కూడా పత్రికను అందించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్?-2047 విజన్? డాక్యుమెంట్?ను రూపొందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. నీతి అయోగ్?సలహాలు సూచనలతో పాటు.. అన్ని రంగాల నిపుణుల మేథో మథనంతో తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒమర్ అబ్దుల్లాకు వివరించారు.ఈ సందర్భంగా సీఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కి ఆహ్వానించినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి, స్వయంగా ఆహ్వానపత్రాన్ని అందచేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రత్యక్షంగా హాజరు కాలేకపోతున్నానని కానీ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆశిస్తున్నానని అన్నారు. అదేవిధంగా హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందని విశ్వసిస్తున్నానని చెప్పారు.



# ఓట్ల రాజకీయంలో కుదేలవుతున్న ఆర్థిక వ్యవస్థ !

**డిసెంబర్5 ప్రజావినికిడి,**
సమాజాం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను ప్రభుత్వాలు అస్సలు పట్టించుకోవడం లేదు. ఏదైనా ఘోరం జరినప్పుడు సంతాపం తెలియచేయడం..తరవాత మర్చిపోవడం షరమామూలుగా మారింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పాలనలో కొత్తదనం కనిపించడంలేదు. భవిష్యత్ నిర్మాణం దిశగా వారి ఆలోచనలు లేవు. అధికారం ఉందికదాని ప్రజాధానం వృధాగా ఖర్చు చేస్తున్నారు. లక్షల కోట్లు అప్పులు చేసి కుప్పలు పెడుతున్నారు. కెసిఆర్, జగన్ బాటలోనే రేవంత్, చంద్రబాబు నాయుడుల పాలన సాగుతోంది. ఉట్టి కెగరలేనమ్మ ఆకాశానికి ఎగిరిందన్న రీతిలో పాలకుల తీరు ఉంది. తెలంగాణలో స్థానిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక్కడ గ్రామాల్లో ప్రధానంగా కోతల బెడద విపరీతంగా ఉంది. గత సిఎం కెసిఆర్ కోతులు వాపస్ పోవాలె అని నినాదం ఇచ్చారు. అది అక్కడికే ఆగిపోయింది. కోతులుకూడా కెసిఆర్‌వి కోతలే అనుకున్నాయేమో గ్రామాలు వదలడం లేదు. గ్రామాలు మొదలుకుని పట్టణాల వరకు వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మొన్నటికి మొన్న వీధి కుక్కల బారిన పడి ఓ మూగబాలుడు ఆస్పత్రి పాలయ్యాడు. వీటిని నిరోధించే కార్యక్రమం చేపట్టడం లేదు. కోతుల కారణంగా తెలంగాణ పల్లెల్లో జనజీవనం తీవ్ర ప్రభావం చూపుతోంది. పంటలు నాశనం అవుతున్నాయి. ఇళ్లన్నీ ధ్వంసం అవుతున్నాయి. ప్రజలపై పడి రక్కుతున్నాయి. దీంతో ప్రతి ఇల్లూ ఓ జైలులాగా తయారయ్యింది. ఇంటికి గేట్లు పెట్టుకుని ప్రజలు తాళాలు వేసుకుంటున్నారు. తినడానికి గతిలేని వారు కూడా ఇంటికో గేటు పెట్టుకోవడం తప్పనిసరి అయ్యింది. తాజాగా ఈ విషయాన్ని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి లోక్‌సభలో ప్రస్తావించారు. తెలంగాణతో పాటు దేశం యావత్తూ సమస్య ఉందన్నారు. దీనిపై జాతీయ విధానం తీసుకోవాలని, కోతుల నిర్మూలన చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ ఆయన అధికారపార్టీ ఎంపి అయినా చెవిటివాడి ముందు శంఖం పూరించినట్లే. దీనిపై స్పందిస్తారని అనుకోవడానికి లేదు. ఎందుకంటే పార్లమెంట్ ఆవరణలోకి కుక్కతో వచ్చారని కాంగ్రెస్ ఎంపి రేణుకాచౌదరిపై అధికార పార్టీ ఎంపి జగదాంబికాపాల్ రచ్చ చేశారు. ఇలాంటివి చేయడం సులభమే కానీ..వీధి కుక్కల బెడదను తప్పించే ప్రయత్నం మాత్రం చేయరు. ఇక ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత బస్సు పేరుతో వందలకోట్లు తగలేస్తున్నారు. ఉచిత బస్సు బదులు టిక్కెట్ల రేట్లు తగ్గించి, రోడ్లు వేసి, బస్ సర్వీసులను పెంచితే ప్రజలందరికీ ఉపయోగం. ఇవన్నీ ఎందుకు చర్చించాల్సి వస్తోందంటే సామాజిక సమస్యలపై ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉంటున్నాయి. గ్రామాల్లో కోతులు నిర్మూలించే వారికే ఓటు వేస్తామని పలు గ్రామాల్లో ప్రకటనలు చేస్తున్నారు. పోస్టర్లు అంటిస్తున్నారు. ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటు. దీనిగురించి ఆలోచించాలి. ఇదొక్కటే కాదు..ఉచితాలపై ఆలోచించాలి. సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్న ఉచిత పథకాలపై ఆలోచన చేయాలి. లేకుంటే దేశం అధోగతి పాలు కాగలదు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో పోటీపడి అమలు చేసే ఉచిత పథకాల వల్ల అభివృద్ధి కుంటు పడుతుందని గుర్తించాలి. అప్పులు చేసి ఉచిత పథకాలను అమలు చేయడం మంచిది కాదని వీరు గుర్తించడం లేదు. ఉచిత బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ఇవే కాకుండా దండగమారి ఖర్చులు కూడా తగ్గించాలి. హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల ఖర్చులు కూడా వేలకోట్లల్లో ఉంటున్నాయి. రాజకీయ నాయకులు తమ పర్యటనలు, వ్యక్తిగత ఖర్చులు చూస్తే గుండె గుభేల్ మంటోంది. మాజీ సిఎం కెసిఆర్ ఐటి రిటర్న్లు కూడా ప్రభుత్వ



డబ్బులతోనే వెళ్లదీసారు. అసెంబ్లీకి రాకున్నా జగన్,కెసిఆర్ లక్షల్లో జీతాలు పొందుతున్నారు. నిజానికి ఇవన్నీ తగ్గించు కోవాల్సిందే. ప్రజలనుకూడా ఉచిత పథకాలతో సోమరిపోతులను తయారుచేయడం తప్ప మరోటి కాదు.
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అభివృద్ధికి సూచిక కానేకాదు. ఈ పథకాన్ని అమలుచేయాలని మహిళలెవరూ కోరలేదు. దీనిని గొప్పగా ప్రకటించుకుని ఇన్ని వందల కోట్లు ఆర్టీసికి కట్టామని చెప్పు కోవడం సిగ్గుచేటు. అర్హులైన పేదవారి అభివృద్ధికి ప్రభుత్వాలు నిర్మాణాత్మకమైన సహాయ సహకారాలు అందించడంలో తప్పులేదు. అయితే ప్రజలను సోమరిపోతులుగా మార్చే ఉచిత పథకాలు ప్రగతిని దెబ్బతీస్తాయి. ఉచిత పథకాల వల్ల అనర్హులు సైతం వాటిని పొందడం ఎలా అని చూస్తున్నారు. తప్పుడు మార్గాలు అవలంబించి తమ పేర్లు పథకాల్లో ఉండేలా పైరవీలు చేస్తున్నారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల ఒరింగేదమి లేదు. ఆ డబ్బులను రోడ్లు బాగు చేయడానికి, బస్ టిక్కెట్ రేట్లను తగ్గించి, సర్వీసులను పెంచడానికి ఉపయోగిస్తే బాగుండేది. చార్జీ చెల్లించి ప్రయాణం చేయలేని వృద్దులు, వికలాంగులు, విద్యార్థులు, మహిళలకు ఈ సౌకర్యం కల్పిస్తే అభ్యంతరం ఉండదు. కానీ అందరినీ ఒకే గాటన కట్టి అమలు చేయడం సరికాదు. ప్రభుత్వ ఉద్యోగులైన స్త్రీలు, ఆర్థికంగా ఉన్న స్త్రీలు ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనవసర ప్రయాణాలు పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంత నష్టం కలిగినా ఫరవాలేదు, మా పార్టీ ఎన్నికల్లో గెలవాలనే దుర్నీతిని రాజకీయ పార్టీలు అనుసరించి, ఉచిత పథకాలను అమలు చేస్తున్నాయి. వృద్దాప్య పింఛన్లు, వికలాంగుల పింఛన్ల విషయంలో అనేక అవకతవకలు బయటపడుతున్నాయి. వాస్తవిక వయసును తగ్గించి, బోగస్ ఆధార కార్డులు పొంది, వృద్దాప్య పింఛన్లు పొందుతున్న కేసులు ఎన్నో ఉన్నాయి. అంగవైకల్యం లేకపోయినా, డాక్టర్లను మేనేజ్ చేసి అనేకమంది వికలాంగుల పింఛన్లు పొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక రేషన్ కార్డులు, బియ్యం జనాభాను మించి అమలు అవుతున్నాయి. రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేసే బియ్యం మాఫియాలకు ఆదాయ వనరుగా మారింది. ఎపిలో పోర్టు నుంచి టన్నులకొద్దీ బియ్యం తరలినట్లు ప్రభుత్వమే గుర్తించింది. ప్రభుత్వం కిలో బియ్యానికి 42 రూపాయలు ఖర్చు చేస్తోంది. రేషన్ బియ్యం తినడానికి ఇష్టపడని ప్రజలు కేజీ 12 రూపాయల వంతున బయట అమ్ముకుంటున్నారు. వేల కోట్ల రూపాయలు ప్రజాధనం ఇలా వృథా అయిపోతోంది. ఈ విషయంలో పత్రికలు గానీ, రాజకీయ నాయకులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గానీ, జాతీయవాద సంస్థల నాయకులు గానీ చర్చించడం లేదు. ఎక్కడ తమ ఓట్లు పోతాయో అన్న భయం వారిని వెన్నాడుతోంది. అందుకే విపక్షంలో ఉన్నవారు సైతం ఉచిత పథకాలు మరిన్ని అమలుకు పట్టుబడుతున్నారు. ఉచిత పథకాలకు ఖర్చు చేసే ధనాన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తే రాష్ట్రాలు బాగుపడతాయి. విద్య,వైద్యరంగాలకు ఖర్చు చేయాలి. రోడ్లు అభివృద్ధి చేయాలి. కొతులు, కుక్కలను తరిమేందుకు ఉపయోగించాలి. దోమల నివారణకు ఉపయోగించాలి. చెత్త వేయకుండా నిరోధించాలి. ఇలా దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరుతాయి. అప్పుడే రాష్ట్రలు స్వయంశక్తితో ముందుకు సాగుతాయి. ఇందుకోసం ప్రజలే నడుం బిగించాలి.

# శంషాబాద్ విమనాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

### ఇండిగో విమానాల రద్దుతో ప్రయాణికుల ఆగ్రహం

### ఎపి మంత్రి పార్థసారథి చొరవతో అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమానం







**హైదరాబాదడిసెంబర్5 ప్రజావినికిడి,**
ఇండిగో విమానాల రాకపోకలను నిలిపేయడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 92 విమానాలు రద్దు చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇందులో శంషాబాద్‌కు రావాల్సినవి 43, ఇక్కడి నుంచి వెళ్లాల్సినవి 49 ఉన్నాయి. ముందుగా బుక్ చేసుకున్న సర్వీసుల రద్దుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్ఇన్ అయిన తర్వాత రద్దు సమాచారం ఇవ్వడంపై నిరసన తెలిపారు. మరోవైపు విశాఖ నుంచి 8 ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేశారు. వీటిలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్‌కు వెళ్లాల్సినవి ఉన్నాయి.
ఏపీ మంత్రి పార్థసారథి జోక్యంతో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమాన సదుపాయాన్ని కల్పించారు. అంతకుముందు విజయవాడ వెళ్లేందుకు శంషాబాద్‌లో ఇండిగో విమానం కోసం పార్థసారథి వేచి ఉన్నారు. అయ్యప్ప భక్తులు ప్రయాణించే విమానం ఆలస్యంపై అడిగి తెలుసుకున్నారు. వారి ఆందోళనను గమనించి స్వయంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌తో మాట్లాడారు. శబరిమలకు విమాన సర్వీసు ఏర్పాటు చేయించారు. విజయవాడకు వెళ్లాల్సిన విమానం మిస్ కావడంతో మంత్రి పార్థసారథి రోడ్డు మార్గంలో బయలుదేరారు. తమకోసం శ్రమపడి ప్రయాణ సదుపాయం కల్పించిన ఆయనకు అయ్యప్ప భక్తులు ధన్యవాదాలు తెలిపారు. ఇకపోతే దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమానాల రద్దు పరంపర కొనసాగుతున్నది. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలతో వరుసగా మూడో రోజూ పెద్ద సంఖ్యలో సర్వీసులు నిలిచిపోయాయి. శుక్రవారం మొత్తం 500కుపైగా విమానాలను సంస్థ రద్దు చేసింది. దీంతో ఎయిర్‌పోర్టుల్లో ఇండిగో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బోర్డింగ్ పక్రియ ముగిసి 12 గంటలవుతున్నా తాము వెళ్లాల్సిన విమానానికి సంబంధించిన ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆందోళలనకు దిగుతున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో అయ్యప్ప స్వాముల నిరసనతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకున్నది. హైదరాబాద్ నుంచి కొచ్చి వెళ్లాల్సిన విమానం 12 గంటల పాటు ఆలస్యం కావడంతో అయ్యప్పలు ఆందోళనకు దిగారు. ఇండిగో విమానం గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కొచ్చి వెళ్లాల్సి ఉంది. ఈ విమానంలో వెళ్లాల్సిన అయ్యప్ప భక్తులు సాయంత్రమే శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే, విమానం శుక్రవారం ఉదయానికి కూడా బయలుదేరకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. బోర్డింగ్ గేటుకు అడ్డంగా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 12 గంటలుగా తాము విమానాశ్రయంలోనే ఉన్నామని, విమానం గురించి తమకు సమాచారం ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయలేదని ఆసహనం వ్యక్తం చేశారు. కాగా, ఇండిగో విమానాల రద్దు కారణంగా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు, మూడు రోజులుగా విమానా సర్వీసులు లేకపోవడంతో ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు.

# టాటా ట్రస్టు నుంచి భారీగా ఎన్నికల విరాళాలు..

# ఒక్క పైసా అందుకోని టీడీపీ, జనసేన!

**డిసెంబర్5 ప్రజావినికిడి,**
గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రముఖ దేశీయ అతిపెద్ద వ్యాపార సంస్థల సమూహమైన టాటా గ్రూపు పెద్ద ఎత్తున విరాళాలు అందజేయడం చర్చనీయాంశం అవుతోంది. ఎన్నికలకు ముందు అధికార బీజేపీతోపాటు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి కూడా టాటా గ్రూపు విరాళాల అందజేసింది. అదేవిధంగా వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలకు నిధులు సమకూర్చిన టాటా గ్రూపులోని ప్రొగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్టు కొన్ని ముఖ్యమైన పార్టీలను విస్మరించడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. టాటా గ్రూప్ తన వ్యాపారాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవడంతోపాటు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాజకీయ పార్టీలకు ఎన్నికల విరాళాలు




సమకూర్చుతుంటుంది. దేశంలోని ఇతర పెద్ద కార్పొరేట్ సంస్థల మాదిరిగానే టాటా గ్రూప్ కూడా విరాళాలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. అయితే దేశంలోని మొత్తం పది పార్టీలకు విరాళాలు ఇచ్చిన టాటా గ్రూపునకు చెందిన పీఈటీ అత్యధికంగా కేంద్ర ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న బీజేపీకి రూ.757 కోట్లు అందజేయడమే చర్చనీయాంశం అవుతోంది. మొత్తం పది పార్టీలకు కలిపి రూ.914 కోట్లు విరాళంగా ఇవ్వగా, అందులో 83 శాతం నిధులను బీజేపీకే కేటాయించడంపై పెద్ద చర్చ జరుగుతోంది. పీఈటీ నుంచి ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి కేవంల రూ.77.3 కోట్లు మాత్రమే అందింది. ఇది బీజేపీకి అందిన విరాళంలో కేవలం 10 శాతం కూడా లేకపోవడం గమనార్హం. రెండు ప్రధాన జాతీయ పార్టీలతోపాటు తృణమూల్ కాంగ్రెస్, వైసీపీ, శివసేన, బీజేడీ, బీఆర్ఎస్, ఎల్జేపీ, జేడీయూ, డీఎంకే పార్టీలకు పీఈటీ నుంచి రూ.10 కోట్లు చొప్పున విరాళాలు అందాయి. ఇవన్నీ ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలే కావడం గమనార్హం. తెలుగు రాష్ట్రాలకు చెందిన వైసీపీ, బీఆర్ఎస్ రూ.10 కోట్లు చొప్పున విరాళాలు అందుకోగా, ఆ రెండు పార్టీలు ఎన్నికల్లో ఓటమి పాలయ్యాయి. ఇక ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచిన టీడీపీ, జనసేన పార్టీలకు ఒక్క రూపాయి కూడా టాటా నుంచి విరాళంగా అందకపోవడం గమనార్హం. 2024-25లో వివిధ ట్రస్టులు, సంస్థల నుంచి కాంగ్రెస్ పార్టీకి మొత్తంగా రూ.517 కోట్లు విరాళంగా అందాయి. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.216.33 కోట్లు, ఏబీ జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.15 కోట్లు న్యూ డెమొక్రటిక్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా రూ.5 కోట్లు జన్ కల్యాణ్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.9.5 లక్షల చొప్పున కాంగ్రెస్ పార్టీకి విరాళాలు అందాయి.

# శ్రీలంకను కుదిపేసిన దిత్వా తుఫాన్

### ఇప్పటి వరకూ 486 మంది మృత్యువాత

### సుమారు 341 మంది ఆచూకీ గల్లంతు



**కొలంబో,డిసెంబర్5 ప్రజావినికిడి,** దిత్వా తుఫాన్ ద్వీప దేశం శ్రీలంకను భారీగా కుదిపేసింది. తుఫాను బీభత్సానికి కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో ఎక్కడికక్కడ వరదలు సంభవించాయి. ఇళ్లు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక పట్టణాలు పూర్తిగా నీట మునిగాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. శ్రీలంక విపత్తు నిర్వహణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో జనజీవనం స్తంభించింది. దిత్వా తుఫాను బీభత్సానికి భారీగా ఆస్తి ప్రాణ నష్టం సంభవించింది. నవంబర్ 16 నుంచి ఇప్పటి వరకూ 486 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 341 మంది ఆచూకీ గల్లంతయింది. ఈ సంక్షోభ సమయంలో భారత దేశం శ్రీలంకకు అండగా నిలుస్తోంది. 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో మానవతా సాయాన్ని అందజేస్తోంది. జాతీయ విపత్తు స్పందన దళం , భారత వాయు సేన ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాయి.

# బాలకృష్ణ అభిమానులకు నిరాశ

### అఖండ-2 వాయిదా వేసిన నిర్మాణ సంస్థ



**హైదరాబాద్,డిసెంబర్5 ప్రజావినికిడి, :** : బాలకృష్ణ – బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' వాయిదా పడింది. ఈ సినిమా విడుదలపై కొన్ని గంటలుగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం సమస్యల్లో చిక్కుకున్నట్లు వార్తలొచ్చాయి. గురువారం రాత్రి ప్లాన్ చేసిన ప్రీమియర్స్‌ను చిత్ర బృందం రద్దు చేయడంతో.. ఆ వార్తలకు బలం చేకూరింది. తాజాగా చిత్ర విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 5న థియేటర్లలో ఈ చిత్రం విడుదల కావాల్సిఉంది. ఈ మేరకు 14 రీల్స్ ప్లస్ సంస్థ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. 'అనివార్య కారణాల వల్ల 'అఖండ 2' షెడ్యూల్ ప్రకారం విడుదల కావడం లేదు. ఈ విషయం పట్ల చింతిస్తున్నాం. ఈ క్షణం మాకు చాలా బాధాకరమైనది. ప్రతి అభిమాని, సినీ ప్రేమికుడికి ఇది కలిగించే నిరాశను మేము అర్థం చేసుకుంటాము. ఈ విషయాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాము. ఈ నిర్ణయం పట్ల కలిగిన అసౌకర్యానికి మా హృదయపూర్వక క్షమాపణలు. ఈ సమయంలో మీ మద్దతు మాకు చాలా అవసరం. అతి త్వరలో సానుకూల నిర్ణయంతో మీ ముందుకు వస్తాం అని నిర్మాణ సంస్థ పేర్కొంది.

# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ,డిసెంబర్5 ప్రజావినికిడి,** మగువలకు బంగారం ధరలు మళ్లీ షాకిచ్చాయి. నిన్న స్వల్పంగా తగ్గిన ధరలు.. శుక్రవారంమళ్లీ పెరిగిపోయాయి. రోజుకోలాగా బంగారం ధరలు హెచ్చు తగ్గులు అవుతున్నాయి. శుక్రవారం తులం గోల్డ్‌పై రూ.270 పెరగగా.. సిల్వర్ ధర మాత్రం దిగొచ్చింది. ఏకంగా రూ.4,000 తగ్గింది.బులియన్ మార్కెట్‌లో ఈరోజు 24 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.270 పెరిగి రూ.1,29, 930 దగ్గర ట్రేడ్ అవుతుండగా.. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.250 పెరిగి రూ.1,19,100 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.210 పెరిగి రూ.97, 450 దగ్గర ట్రేడ్ అవుతోంది.వెండి ధర మాత్రం ఈరోజు భారీ ఉపశమనం కలిగింది. ఈరోజు బులియన్ మార్కెట్‌లో కిలో వెండిపై రూ.4,000 తగ్గి రూ.1,87, 000 దగ్గర ట్రేడ్ అవుతోంది. చెన్నై, హైదరాబాద్‌లో మాత్రం రూ.1,96,000 దగ్గర అమ్ముడవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి రూ.1,87,000 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# ఫైనల్ మ్యాచ్‌కు పెద్ద మార్పులు!

## ప్రసిద్ధ్ కృష్ణకు ఉద్వాసన పలికే చాన్స్

## నితీష్ కుమార్ రెడ్డికి అవకాశం!!

## నేడు దక్షిణాఫ్రికాతో భారత్ మూడో వన్డే

భారత్- దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్ ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. విశాఖపట్నంలో జరిగే మూడో, చివరి వన్డే రెండు జట్లకు 'డూ ఆర్ డై' మ్యాచ్ అవుతుంది. మొదటి మ్యాచ్‌లో విజయం సాధించిన తర్వాత, భారత్ రెండో వన్డేలో ఘోరంగా దెబ్బతింది. దక్షిణాఫ్రికా 359 పరుగుల భారీ లక్ష్యాన్ని సులభంగా ఛేదించింది. కాబట్టి, ఇప్పుడు కెఎల్ రాహుల్ కెప్టెన్సీలోని జట్టుపై ఒత్తిడి రెట్టింపు అయింది. రెండో వన్డేలో భారత బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ. 8.2 ఓవర్లలో 85 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేదు. అతని ప్రదర్శన మొత్తం సిరీస్‌లో సాధారణంగా ఉంది. నిరంతరం పరుగులు ఇవ్వడం, ఎటువంటి ప్రభావాన్ని చూపించలేకపోవడంతో, సెలెక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ ఇప్పుడు మార్పులకు మాత్రమే అవకాశం ఉంది. నిర్ణయాత్మక మ్యాచ్‌లో ప్రసిద్ధ్ కృష్ణను జట్టు నుంచి ఉద్వాసన పలకాలని భావిస్తున్నారు.నివేదికల ప్రకారం, అతని స్థానంలో యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని ప్లేయింగ్ 11లో చేర్చవచ్చు. నితీష్ రెడ్డి దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. డెత్ ఓవర్లలో వేగంగా పరుగులు చేయడంతో పాటు వికెట్లు తీసే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాడు. విశాఖపట్నం పిచ్ బ్యాటింగ్‌కు సహకరిస్తుంది. కాబట్టి, జట్టుకు బ్యాటింగ్‌లో లోతును అందించగల ,బౌలింగ్‌లో ఆరో ఆప్షన్‌గా సహాయపడే ఆల్ రౌండర్ అవసరం. గత రెండు మ్యాచ్‌లలో టీమ్ ఇండియా చివరి ఓవర్లలో పరుగులు సాధించడంలో ఇబ్బంది పడింది. అటువంటి పరిస్థితిలో, నితీష్ రెడ్డిని చేర్చడం భారత బ్యాటింగ్‌కు బలాన్ని చేకూరుస్తుంది. జట్టు సమతుల్యతను కూడా మెరుగుపరుస్తుంది.ప్రసిద్ధ్ కృష్ణను తొలగిస్తే, బౌలింగ్ యూనిట్ ఈ విధంగా ఉండవచ్చు, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, నితీష్ రెడ్డి ఆరో బౌలర్‌గా ఉంటారు. ఈ కలయిక జట్టుకు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో స్థిరత్వాన్ని అందిస్తుంది. ఆఖరి వన్డేలోనూ టీమిండియా తుది జట్టులో మార్పులు చేసే అవకాశం లేదు. శ్రేయస్ అయ్యర్ గైర్హాజరీలో వచ్చిన అవకాశాన్ని రుతురాజ్ గైక్వాడ్ అందుకున్నాడు. అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. దాంతో రిషభ్ పంత్, తిలక్ వర్మ, ధ్రువ్ జురెల్ బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో వచ్చిన అవకాశాలను యశస్వి జైస్వాల్ అందిపుచ్చుకోలేక పోయాడు.వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. అయితే మూడో వన్డేలో అతనికి ఆఖరి అవకాశం దక్కనుంది. ఒకవేళ జైస్వాల్‌ను తప్పించాలనుకుంటే రుతురాజ్ గైక్వాడ్‌ను ఓపెనర్‌గా ఆడించాల్సి ఉంటుంది. ఆ సాహసం గంభీర్ చేయకపోవచ్చు. ఇప్పటికే బ్యాటింగ్ ఆర్డర్‌లో చేసిన ప్రయోగాలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలి రెండు వన్డేల్లో సుందర్ అంచనాలను అందుకోలేకపోయాడు. కేఎల్ రాహుల్ సూపర్ ఫామ్‌లో ఉండగా.. రవీంద్ర జడేజా ఫినిషర్ పాత్ర పోషించాల్సి ఉంది. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ సత్తా చాటాలి. రెండో వన్డేలో విఫలమైన భారత పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా , ప్రసిధ్ కృష్ణ మెరుగ్గా బౌలింగ్ చేయాలి. ఫీల్డింగ్ కూడా మెరుగుపడాలి. అప్పుడే భారత్‌కు విజయం సాధ్యమవుతుంది. బెంచ్ ప్లేయర్లు ధ్రువ్ జురెల్, రిషభ్ పంత్, తిలక్ వర్మలకు నిరాశే ఎదురవ్వనుంది. ఇక విశాఖపట్నంలో వన్డే ఫార్మాట్‌లో భారత జట్టు రికార్డు అద్భుతంగా ఉంది. టీమ్ ఇండియా ఈ మైదానంలో



ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 7 మ్యాచ్‌లలో భారత జట్టు విజయం సాధించగా, రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు. స్టేడియం పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ పిచ్‌లో అత్యధిక స్కోర్లు భారత్ జట్టువే. డిసెంబర్ 18, 2019న భారత్ వెస్టిండీస్‌పై 5 వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. అదేవిధంగా, ఏప్రిల్ 5, 2005న పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 9 వికెట్ల నష్టానికి 356 పరుగులు చేసింది. రెండు మ్యాచ్‌ల్లోనూ భారత జట్టు విజయం సాధించింది. అత్యల్ప స్కోరు రికార్డు న్యూజిలాండ్‌పై ఉంది. అక్టోబర్ 29, 2016న భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 79 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో అత్యల్ప స్కోరు భారత్‌ది. మార్చి 19, 2023న ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 117 పరుగులకు ఆలౌట్ అయింది. పరుగుల తేడాతో అతిపెద్ద విజయాన్ని భారత్ 2016లో న్యూజిలాండ్‌పై నమోదు చేసింది. భారత జట్టు 190 పరుగుల తేడాతో గెలిచింది. వికెట్ల తేడాతో అతిపెద్ద విజయం ఆస్ట్రేలియా పేరున ఉంది. ఆస్ట్రేలియా 2023లో భారత్‌ను 10 వికెట్ల తేడాతో ఓడించింది. తుది జట్టు(అంచనా)రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, వాషింగ్టన్ సుందర్/నితీష్ కుమార్ రెడ్డి/, కేఎల్ రాహుల్(కెప్టెన్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.ధ్రువ్ జురెల్, రిషభ్ పంత్, నితీష్ కుమార్ రెడ్డి, తిలక్ వర్మ

# కోహ్లీ, రోహిత్‌తో పెట్టుకోవద్దు

- గంభీర్‌ను హెచ్చరించిన మాజీ కోచ్ రవిశాస్త్రి




టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలతో పెట్టుకోవద్దని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను మాజీ కోచ్ రవిశాస్త్రి హెచ్చరించాడు. వ్యక్తిగత అజెండాతో వారిని ఇబ్బంది పెట్టడమంటే కొరివితో తల గోక్కోవడమేనని తెలిపాడు. వాళ్లకు చిర్రెత్తుకొస్తే అందరూ దెబ్బతింటారని వార్నింగ్ ఇచ్చాడు. టీ20, టెస్ట్ ఫార్మాట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ, రోహిత్ శర్మ కేవలం వన్డే ఫార్మాట్‌లోనే ఆడుతున్నారు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నారు.ప్రస్తుతం ఈ ఇద్దరూ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. కానీ మరో రెండేళ్ల వరకు జట్టులో కొనసాగుతారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో రోహిత్, కోహ్లీకి పడటం లేదనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రవిశాస్త్రి మాట్లాడుతూ.. గంభీర్‌ను హెచ్చరించాడు.'ఆటలో కోహ్లీ, రోహిత్ తాతలు. వైట్‌బాల్ ఫార్మాట్ దిగ్గజాలు. వాళ్లను అనవసరంగా కెలకొద్దు. వాళ్లకు చిర్రెత్తుకొచ్చిందంటే అందరూ దెబ్బతింటారు. అనుభవాన్ని అంగట్లో కొనుక్కోలేం. ఒకరు ఛేజింగ్ కింగ్ అయితే.. మరొకరు మూడు వన్డే డబుల్ సెంచరీలు సాధించాడు.'అని రవిశాస్త్రి చెప్పుకొచ్చాడు. టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ కూడా గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌పై విమర్శలు గుప్పించాడు. వారి పేర్లను నేరుగా ప్రస్తావించకుండా పరోక్ష వ్యాఖ్యలు చేశాడు. కెరీర్‌లో పెద్దగా సాధించని వ్యక్తులు రోహిత్, కోహ్లీ భవిష్యత్తును నిర్ణయిస్తుండటం దురదృష్టకరమని భజ్జీ అభిప్రాయపడ్డాడు. 'ఏం సాధించని కొందరు ఆటగాళ్ల కెరీర్‌లను శాసిస్తుంటారు. నా విషయంలోనూ ఇలా జరిగింది. నా సహచరుల్లో చాలా మందికి ఇలా జరిగింది. చాలా దురదృష్టకరం. దీని గురించి ఎప్పుడూ ఎవరం మాట్లాడం. చర్చించం. విరాట్ కోహ్లీ లాంటి ఆటగాడు మెరుగైన ప్రదర్శన చేస్తుంటే చాలా సంతోషంగా ఉంది. రోహిత్ శర్మ కూడా గొప్పగా ఆడుతున్నాడు. వాళ్లిద్దరూ పరుగులు చేస్తున్నారు. కెరీర్‌లో ఏ ఘనతలు అందుకొని వ్యక్తులు రోహిత్, కోహ్లీ భవిష్యత్తును నిర్ణయిస్తుండటం దురదృష్టకరం.'అని హర్భజన్ సింగ్ తెలిపాడు.

# షమీ, వరుణ్ చక్రవర్తిని ఎందుకు పక్కన పెట్టారు

## మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ప్రశ్న

మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ బుధవారం రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో సమష్టిగా విఫలమైన భారత్ 4 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. 358 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. ఈ పరాజయంపై మాట్లాడిన హర్భజన్ సింగ్.. బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయడంపై దృష్టిసారించాలని టీమిండియా మేనేజ్‌మెంట్‌కు సూచించాడు.'ఇంగ్లండ్ పర్యటనలో జస్‌ప్రీత్ బుమ్రా లేకపోయినా మహమ్మద్ సిరాజ్ అద్భుతంగా రాణించాడు. బుమ్రా ఆడని మ్యాచ్‌లను కూడా భారత్ గెలిచింది. కానీ వన్డేలు, టీ20ల్లో మాత్రం ఫలితం భిన్నంగా ఉంటుంది. ఈ ఫార్మాట్లలో కూడా బుమ్రాకు ప్రత్యామ్నాయ బౌలర్లను కనుగొనాలి. అది స్పిన్నర్ అయినా పేసర్ అయినా వికెట్లు తీయగల బౌలర్‌ను గుర్తించాలి. ఇప్పటికే జట్టులో కుల్దీప్ యాదవ్ స్పిన్నర్‌గా ఉన్నాడు. అతనికి తోడుగా వరుణ్ చక్రవర్తిని కూడా జట్టులోకి తీసుకురావాలి. అతను ఇప్పటికే టీ20ల్లో మెరుగైన ప్రదర్శన చేశాడు. కాబట్టి వన్డేల్లో కూడా అవకాశం ఇవ్వాలి. మహమ్మద్ షమీని ఎందుకు పక్కనపెట్టారో నాకు అర్థం కావడం లేదు. ప్రసిధ్ కృష్ణ జట్టులో ఉన్నాడు. అతను మెరుగైన బౌలర్. కానీ అతను ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఎంతో మంది మంచి బౌలర్లు ఉన్నారు. బుమ్రా లేకుంటే టీమిండియా బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా లేకున్నా మ్యాచ్‌లను గెలిపించగల బౌలర్లను జట్టులోకి తీసుకురావాలి. వర్క్‌లోడ్‌లో భాగంగా బుమ్రా వన్డేలు ఆడటం లేదు. మరోవైపు మహమ్మద్ షమీకి అవకాశాలు ఇవ్వడం లేదు. అతను ముస్తాక్ అలీ ట్రోఫీలో బెంగాల్ తరఫున ఆడుతున్నాడు. భారత్ 358 పరుగులు చేసినా ఓడిపోవడం తీవ్రంగా



నిరాశపరిచింది. వికెట్లు తీయడానికి భారత్ ఒక మార్గాన్ని కనుగొనాలి. సొంతగడ్డపై టెస్ట్, వన్డే సిరీస్‌లు చేజార్చుకోకూడదు. ఈ వన్డే సిరీస్ కూడా ఓడిపోతే అభిమానుల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. ఎట్టి పరిస్థితుల్లో మూడో వన్డేలో భారత్ విజయం సాధించాలి.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు. ఆఖరి వన్డే డిసెంబర్ 6న వైజాగ్ వేదికగా జరగనుంది.

## భారీ రికార్డుకు అడుగుదూరంలో

# రోహిత్ శర్మ




టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ భారీ రికార్డుకు అడుగుదూరంలో ఉన్నాడు. అతడు శనివారం విశాఖ వేదికగా దక్షిణాఫ్రికాతో జరగనున్న మూడో వన్డే మ్యాచ్‌లో 27 పరుగులు చేస్తే.. అంతర్జాతీయ క్రికెట్‌లో 20 వేల పరుగుల మైలురాయిని పూర్తి చేసుకుంటాడు. ఈ ఘనత సాధించిన నాలుగో భారత ప్లేయర్‌గా రికార్డులకు ఎక్కుతాడు.ఇప్పటివరకూ భారత్ తరఫున సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రాహుల్ ద్రవిడ్‌లు మాత్రమే అంతర్జాతీయ క్రికెట్‌లో 20 వేల కంటే ఎక్కువ పరుగులు సాధించారు.రోహిత్ శర్మ ఇప్పటి వరకు 504 అంతర్జాతీయ మ్యాచ్‌లు (67 టెస్టులు, 278 వన్డేలు, 159 టీ20లు)ఆడాడు. 19,973 పరుగులు (టెస్టుల్లో 4301, వన్డేల్లో 11441, టీ20ల్లో 4231) సాధించాడు. మొత్తంగా 50 సెంచరీలు, 110 హాఫ్ సెంచరీలు అతడి ఖాతాలో ఉన్నాయి. మరోవైపు మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రస్తుతానికి 1-1తో సమంగా ఉంది. రాంచీ వేదికగా జరిగిన తొలి మ్యాచ్ లో టీమిండియా విజయం సాధించగా.. రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండవ వన్డే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలుపొందింది. దీంతో విశాఖ వేదికగా జరిగే మూడో వన్డే మ్యాచ్‌లో ఎవరు విజయం సాధిస్తారో వారే 2-1తో తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంటారు. ఈ క్రమంలో ఈ మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని ఇరు జట్లు భావిస్తున్నాయి.



## పోలీస్ కమిషనర్‌గా

# రిచా ఘోష్

మహిళల వన్డే ప్రపంచకప్ విజేత, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) విధ్వంసకర వికెట్ కీపర్ రిచా ఘోష్‌ను వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం.. సిలిగురి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ)గా నియమించింది. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హోదాలో ఆమె ఈ బాధ్యతలు చేపట్టింది. వెస్ట్ బెంగాల్ డీజీపీ(డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) శ్రీ రాజీవ్ కుమార్(ఐపీఎస్) చేతుల మీదుగా రిచా ఘోష్ బాధ్యతలు స్వీకరించింది. పోలీస్ డ్రెస్‌లో రిచా ఘోష్ డీజీపీని కలవగా.. ఈ ఫొటోలను ఎక్స్ వేదికగా వెస్ట్ బెంగాల్ పోలీస్ విభాగం పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. లేడీ సింగం రిచా ఘోష్ అని ఫ్యాన్స్ ఆమెపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. క్రికెటర్ నుంచి పోలీస్ అధికారిగా నియామకమైన రిచా ఘోష్ జీవిత ప్రయాణానికి సంబంధించిన వీడియోను కూడా వెస్ట్ బెంగాల్ పోలీసులు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో భారత జట్టు విజేతగా నిలవడంలో 22 ఏళ్ల రిచా ఘోష్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. దాంతో వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం తమ రాష్ట్ర ప్లేయర్ అయిన రిచా ఘోష్‌కు డీఎస్పీ ఉద్యోగంతో పాటు రూ.34 లక్షల క్యాష్ ప్రైజ్ అందజేసింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక


# అవతార్-3లో వారణాసి స్పెషల్ వీడియో



'వారణాసి' సినిమాను దర్శకధీరుడు రాజమౌళి భారీ స్థాయిలో తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందని తెలిసినప్పటినుంచే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఏర్పడింది. తాజాగా దీనికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం హాలీవుడ్‌లోనూ వైరల్ అవుతోంది. అవతార్ 3 సినిమాలోను 'వారణాసి' సర్‌ప్రైజ్ ఉండనున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. దీంతో ఈ న్యూస్ సోషల్ మీడియాలో షేర్ అవుతోంది.'అవతార్' డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ అంటే రాజమౌళికి ఎంత అభిమానమో తెలిసిన విషయమే. సందర్భం వచ్చినప్పుడల్లా జక్కన్న ఆయన గురించి చెబుతూనే ఉంటారు. ఇప్పుడు జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన 'అవతార్ 3' సినిమాలో రాజమౌళి 'వారణాసి' సర్‌ప్రైజ్ ప్లాన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్ 19న 'అవతార్ 3' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలోనే 'వారణాసి'కి సంబంధించిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించే ఆలోచన చేస్తున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో మహేశ్ రుద్ర పాత్రలో నటిస్తున్నారు. విలన్ పాత్ర కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. ప్రియాంకా చోప్రా.. మందాకినిగా సందడి చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన వీరి లుక్స్‌కూ విశేష స్పందన దక్కింది.

# సైక్ సిద్ధార్థ నుంచి సాంగ్ విడుదల




శ్రీనందు హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మిస్తోన్న చిత్రం 'సైక్ సిద్దార్థ' వరుణ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోంది. యామిని భాస్కర్ కథానాయిక. డిసెంబర్ 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఇందులోని లవ్‌సాంగ్‌ను విడుదల చేశారు. 'ధుమ్ తకుమ్..' అంటూ సాగే ఈ పాటకు కాశర్ల శ్యామ్ లిరిక్స్ రాయగా.. జెస్సీ గిఫ్ట్ ఆలపించారు.

# ఆర్థిక లావాదేవీలపై అనవసర వార్తల తగదు

**త్వరలోనే అఖండ-2 విడుదల ఉంటుందన్న దగ్గుబాటి**



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో భారీ అంచనాల మధ్య రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' విడుదల వాయిదా పడటం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఈ చిత్రం డిసెంబర్ 5న విడుదల కావాల్సి ఉండగా.. కొన్ని ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై తాజాగా టాలీవుడ్ అగ్ర నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ అయిన సురేష్ బాబు స్పందించారు. 'అఖండ 2' వాయిదాకు గల అసలు కారణాలను బయటపెట్టకుండా అనవసరపు ఊహాగానాలకు తెరదించారు. సైక్ సిద్దార్థ సినిమా కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ బాబు 'అఖండ 2' ఇష్యూ గురించి ప్రస్తావిస్తూ.. నేను కూడా ఆ సమస్య గురించి మాట్లాడాటానికే వెళ్లాను. త్వరలోనే 'అఖండ 2' సమస్య పరిష్కారమవుతుంది. అఖండ 2 కి సంబంధించి అన్నీ ఆర్థికపరమైన ఇబ్బందులే అవి బయటకు వెల్లడించకూడదు అని అన్నారు. అలాగే సినిమాకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల గురించి ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు రాస్తున్నారు. ఇది దురదృష్టకరం. ప్రతిఒక్కరూ 'అఖండ 2' రిలీజ్ కాకపోవడానికి ఏవేవో కారణాలు చెబుతున్నారు. అన్ని కోట్లు చెల్లించాలట అని రాస్తున్నారు. అవి అన్నీ అనవసరపు ప్రస్తావనలు అని సురేష్ బాబు స్పష్టం చేశారు. ఆడియన్స్ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమై సినిమా విడుదలవుతుంది. అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

-------------

# పుష్ప-2 విడుదలకు ఏడాది

**ఎమోషనల్ పోస్ట్ చేసిన అల్లు అర్జున్ -విమల్ థియేటర్‌లో పుష్ప-2 టిక్కెట్ల రగడ**



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రూల్' గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్‌ను అందుకోవడమే కాకుండా రూ.1800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం విడుదలై నేటికి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మూవీని గుర్తుచేసుకుంటూ అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుష్ప' ఫ్రాంచైజీ తన జీవితంలో ఒక మరువలేని ప్రయాణంగా మిగిలిందని అల్లు అర్జున్ పేర్కొన్నారు.'పుష్ప' మా జీవితంలో ఐదేళ్ల పాటు సాగిన మరువలేని ప్రయాణంగా నిలిచింది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన అపారమైన ప్రేమ, శక్తి, మా కళను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి అవసరమైన ధైర్యాన్ని అందించింది. ఈ చిత్రాన్ని ఒక అద్భుతంగా మార్చినందుకు ఈ దేశంలోని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరికీ మేము ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటాము. నా కళాకారులందరితో, సాంకేతిక నిపుణులతో, మొత్తం యూనిట్‌తో, నిర్మాతలు, పంపిణీదారులు మరియు ముఖ్యంగా మా కెప్టెన్ సుకుమార్ గారితో కలిసి ఈ ప్రయాణంలో నడవడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఈ ప్రయాణంలో భాగమైన మీ ప్రతి ఒక్కరికీ నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మరోసారి, హృదయం నిండా కృతజ్ఞతతో ధన్యవాదాలు అంటూ అల్లు అర్జున్ రాసుకొచ్చాడు. ఇదిలావుంటే బాలానగర్ విమల్ థియేటర్‌లో పుష్ప 2 టికెట్ల రగడ కొనసాగింది. పుష్ప 2 రిలీజ్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా విమల్ థియేటర్‌లో పుష్ప 2 సినిమా వేశారు. ఈ నేపథ్యంలో పలువురు అభిమానులకు టికెట్స్ అందలేదు దీంతో ఫ్యాన్స్ ఆగ్రహానికి గురయ్యారు. టికెట్స్ లేకపోవడంతో ఆగ్రహంతో రెండు వర్గాలకు చెందిన ఫ్యాన్స్ పొట్టుపొట్టు కొట్టుకున్నారు. ఈ ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# తేరే ఇష్క్ మే తెలుగు ట్రైలర్ విడుదల



కోలీవుడ్ స్టార్ ధనుష్, బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్ జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా 'తేరే ఇష్క్ మే'. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఇదే సినిమాను తెలుగులో అమరకావ్యం పేరుతో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మూవీ నుంచి తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సినిమాకు ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆనంద్ ఎల్ రాయ్, ధనుష్ కాంబినేషన్‌లో 'రాంఝణా', 'అత్రంగి రే' తర్వాత మూడో చిత్రంగా ఈ సినిమా తెరకెక్కింది.

--------

# ప్రతీ ఏటా జపాన్‌కు వస్తా...

**అభిమానులకు ప్రభాస్ హామీ**



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ జపాన్‌లో సందడి చేశారు. ఎస్ఎస్ రాజమౌళి అద్భుత సృష్టి 'బాహుబలి' రెండు భాగాలను కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో అక్కడ ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ నెల 12న ఈ సినిమా జపాన్‌లో విడుదల కానున్న నేపథ్యంలో ఈ స్పెషల్ స్క్రీనింగ్ కోసం ఆ దేశానికి వెళ్లిన ప్రభాస్, అక్కడి అభిమానులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. తన వినయంతో, ఆప్యాయతతో అందరి మనసులు గెలుచుకున్నారు.

ఈ సందర్భంగా అభిమానులను ఉద్దేశించి ప్రభాస్ మాట్లాడారు. "మీ ప్రేమకు ధన్యవాదాలు. బాహుబలి తర్వాత రాజమౌళి, శోభు, లక్ష్మి అందరూ మీ గురించి చాలా గొప్పగా చెప్పారు. మీరు చాలా మంచి అభిమానులని, ఎమోషనల్ పీపుల్ అని అనేవారు. గడిచిన 10 ఏళ్లుగా జపాన్ గురించి వింటూనే ఉన్నాను. ఎట్టకేలకు మిమ్మల్ని చూశాను. థ్యాంక్యూ" అని అన్నారు.

"జపాన్‌కు వచ్చి మిమ్మల్ని వ్యక్తిగతంగా కలవాలనేది నా కల. అది ఇప్పుడు నెరవేరింది. లక్ష్మి గారిలాగే నేను కూడా ప్రతీ ఏటా ఇక్కడికి వచ్చి మిమ్మల్ని కలుస్తానని ఆశిస్తున్నాను" అని అభిమానులతో డార్లింగ్ అన్నారు. 'బాహుబలి: ది బిగినింగ్', 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' చిత్రాలను కలిపి ఒకే భాగంగా ఈ స్పెషల్ ఎడిషన్‌ను రూపొందించారు. ప్రభాస్ రాకతో భారతీయ సినిమాకు, జపాన్ ప్రేక్షకులకు మధ్య బంధం మరింత బలపడింది.

ప్రస్తుతం ప్రభాస్ 'ది రాజాసాబ్', 'స్పిరిట్', 'ఫౌజి', 'సలార్: పార్ట్ 2 %-% శౌర్యాంగ పర్వం', 'కల్కి 2898 ఏడీ పార్ట్ 2' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'బాహుబలి' సిరీస్‌లో రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించిన విషయం తెలిసిందే.

# చిన్నప్పుడు దేవుడితో గొడవపడేదాన్నని

**- భాగ్యశ్రీ**



యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తన వ్యక్తిగత విశ్వాసాలు, దైవచింతనకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. చిన్నతనంలో తనకు ఏదైనా కష్టం వస్తే దేవుడినే తన తండ్రిగా భావించి ఆయనతో పోట్లాడేదాన్నని, కానీ ఇప్పుడు ఆ దేవుడి నిర్ణయాలనే పూర్తిగా విశ్వసిస్తున్నానని తెలిపారు. శుక్రవారం నాడు ఓ ఆలయంలో ప్రశాంతంగా ఉన్న వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పోస్ట్ చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు."నాకు గుర్తుంది.. చిన్నప్పుడు జీవితంలో ఎలాంటి కష్టం వచ్చినా నేను చేసే మొదటి పని దేవుడితో గొడవపడటమే. ఆయనే నా తండ్రి అన్నట్లు ప్రతీసారి ప్రశ్నించేదాన్ని. కానీ ఇప్పుడు నేను ఓ దశకు చేరుకున్నాను. నాకేది మంచిదో ఆయనకు కచ్చితంగా తెలుసని ఇప్పుడు నేను నమ్ముతున్నాను" అని తన పోస్టులో ఆమె రాసుకొచ్చారు. ప్రస్తుతం ఆమె కెరీర్ పరంగా మంచి విజయాలు అందుకుంటున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఇటీవల భాగ్యశ్రీ నటించిన 'కాంత', 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రాల్లో ఆమె నటనకు విమర్శకుల నుంచి, ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో వచ్చిన పీరియడ్ డ్రామా 'కాంత'లో ఆమె పోషించిన కుమారి పాత్రకు విశేషమైన స్పందన లభించింది. ఈ సినిమా విజయంపై ఆమె మాట్లాడుతూ, కష్టపడితే కచ్చితంగా మంచి ఫలితాలు వస్తాయని తాను నమ్ముతున్నట్లు తెలిపారు.నటుడు రానా దగ్గుబాటిని తన గురువుగా అభివర్ణిస్తూ, "మొదటి రోజు నుంచి నాకు మద్దతుగా నిలిచిన రానాకు ధన్యవాదాలు. మీరు నిజమైన స్నేహితుడు, మంచి వ్యక్తి. ఈ ప్రయాణంలో మీరు నా గురువుగా ఉండటం నా అదృష్టం. మీ మార్గదర్శకత్వం లేకపోతే నేను ఇది చేయగలిగేదాన్ని కాదు" అని తెలిపారు. ఇక తన సహనటుడు దుల్కర్ సల్మాన్‌ను ప్రశంసిస్తూ, "ప్రియమైన దుల్కర్, మీరు నిజమైన 'నడిప్పు చక్రవర్తి'. మీ పక్కన నటించడం గొప్ప అనుభూతి. ప్రతీ ఫ్రేమ్‌లో మీరు అద్భుతంగా కనిపించారు. నటుడిగా మా అందరికీ మీరు ఒక స్ఫూర్తి" అని ఆమె పోస్టులో పేర్కొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613